RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక




## సెలవు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా గురువారం మా కార్యాలానికి సెలవు. కావున శుక్రవారం పత్రిక వెలువడదు.

ఇట్లు
పద్మక్రాంతి దిన పత్రిక
యాజమాన్యం.

సంపుటి : 04 | సంచిక : 25 | రంగారెడ్డి | ఎడిటర్ : గంజి వెంకటేశ్ | గురువారం, జనవరి 15, 2026 | పేజీలు : 8 | వెల: 3 రూ.

Volume: 04 | Issue :25 | Rangareddy | Editor: Ganji Venkatesh | Thursday, January 15, 2026 | Pages:8 | Price: 3/-



# మరోమారు రాజ్యసభకు నో

- దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన

**భోపాల్,జనవరి14(పద్మక్రాంతి):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెపా- ్పరు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస- ్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.

ప్రయత్నాలు విఫలం అయినా..

# ప్రార్థనలు విఫలం కావు

## ఎక్స్‌లో డికె శివకుమార్ ఆసక్తికర పోస్ట్

## కన్నడ రాజకీయాల్లో మరోమారు ఆసక్తికర చర్చ



**బెంగళూరు,జనవరి14(పద్మక్రాంతి):**

కర్ణాటకలో నాయకత్వ మార్పు జరుగనుందంటూ కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. 'ప్రయత్నాలు విఫలమైనప్పటికీ ప్రార్థనలు విఫలం కావు' అంటూ ఆయన చేసిన పోస్ట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని మైసూరులో మంగళవారంనాడు డీకే కలిశారు. ఈ నేపథ్యంలో ఆయన చేసిన తాజా పోస్ట్ ఆసక్తిని రేపుతోంది. శివకుమార్ పోస్ట్ కీలకమైన రాజకీయ సంకేతంగా రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడు తున్నారు. ముఖ్యమంత్రి కావాలనే తన ఆకాంక్షను డీకే శివకుమార్ చాలాకాలం క్రితమే వ్యక్తం చేశారు. అయితే దీనిపై

## అర్ధరాత్రి జర్నలిస్టుల

# అరెస్ట్ దారుణం

**రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన**

**అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**

సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు.
అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బ- ెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

# జర్నలిస్టుల అరెస్టు దారుణం

- విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు
- రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**

తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# వ్యక్తిత్వ హననం జరిగితే సహించం

- వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు వార్తలు సరికాదు
- మహిళా ఐఎఎస్ కేసుపై డిజిపి శివధర్ రెడ్డి స్పందన



**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**

చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్లలో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. 'సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు.

03

# ఉత్సాహంగా సాగిన కైట్ ఫెస్టివల్

- పరేడ్ గ్రౌండ్‌లో సందడిగా ఎగిరిన పతంగులు
- నోరూరించేలా స్వీట్ స్టాల్స్



**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**

సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 'అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ 2026' ప్రారంభమైంది. రంగురంగుల పతంగులతో భాగ్యనగర ఆకాశం ఒక అద్భుతమైన కాన్వాస్‌లా మారిపోయింది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలో ప్రపంచం నలుమూలల నుంచి కైట్ ప్లయర్స్ తరలివచ్చారు. రష్యా, పోర్చుగల్,

03

## ఎన్టీవీ జర్నలిస్టుల

# అరెస్ట్ దుర్మార్గం

- పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**



ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల

03

# భోగి వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం



**సంప్రదాయ ముగ్గుల పోటీలు..ఎడ్ల బండ్లపై ఊరేగింపు**

**స్థానిక చిన్నారులకు ఆటల పోటీలు..పాల్గొన్న దేవాన్ష్**

**గంగిరెద్దుల విన్యాసాలతో సందడిగా నారావారి పల్లె**

**కుప్పం,జనవరి14(పద్మక్రాంతి):**

సంస్కృతి, సంప్రదాయలు చాటి చెప్పేలా నారావారిపల్లిలో భోగి పండగ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ భోగి వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబసమేతంగా పాల్గొంటున్నారు. వరుసగా రెండోరోజు తన స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలు భార్య భువనేశ్వరితో సహా కుటుంబసభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. ఇక బుధవారం భోగి పండగ వేళ.. సీఎం చంద్రబాబు మనవడు దేవాన్ష్, నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్వినీ, శ్రీభరత్ దంపతుల పిల్లలు ఎద్దుల బండిలో ఊరేగారు. ఈ సందర్భంగా ఎద్దుల బండిని

03

## మహిళా ఐఎఎస్‌పై

# అసత్య కథనాలు

- అందుకే చట్టప్రకారం విలేకర్ల అరెస్ట్
- విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా
- అందుకే ఇద్దరిని అరెస్ట్ చేశాం..వివరాలు త్వరలో వెల్లడిస్తాం
- మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**



ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరె- స్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి

03

పద్మక్రాంతి
RNI No : TELTEL/2022/85167
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# సంక్రాంతితోనే ఉత్తరాయణం ప్రారంభం !

కాలగమనంలో మార్పును సూచించేదే సంక్రాంతి. చలికాం ముగిసిపోయి..వెచ్చని అడుగులు పడుతున్నాయన్న సంకేతం ఇచ్చేదే సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయంనం నుంచి ఉత్తరాయణంలోకి పయనించేది కూడా సంక్రాంతి నుంచే. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది. ఈ ఉత్తరాయణాన్ని దేవతలకు సంబంధించిన కాలంగా పరిగణిస్తారు. అందుకే ఈ కాలాన్ని ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. ఈరోజు నుంచి వివాహం, గృహప్రవేశం, నామకరణం, కొత్త వ్యాపారం వంటి ఇతర శుభ కార్యాలపై ఉన్న నిషేధం కూడా తొలగిపోతుంది. హిందువుల పండుగలు అన్నీ కానుగతిని బట్టి నిర్ణయించినవే. ఇందులో శాస్త్రీయతో పాటు, బలమైన సందేశం ఉంది. పండగల వైశిష్ట్యం అంతాఇంతా కాదు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంది. వాటిని ఆరించే విధంగా చేస్తున్నవే పండగలు. సంక్రాంతి పండగ తెలుగు వారికి పెద్ద పండగే అయినా...దేశంలోని పలు ప్రాంతాల్లో దీనిని పలు రకాలుగా జరుపు కుంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మకర సంక్రాంతి పండుగని సూర్యుడు రాశి మార్పు ఉత్తరాయణం ప్రారంభానికి సూచికగా భావిస్తారు. ఇదే రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం చేసిన షట్తిల ఏకాదశి అరుదైన కలయిక ఏర్పడుతోందని చెబుతున్నారు పండితులు. ఈ ప్రత్యేక యోగంలో చేసే పవిత్ర స్నానం, దానధర్మాలు, పూజలు మామూలు రోజులు చేసే పూజాఫలం కంటే అనేక రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు. షట్తిల ఏకాదశి ఉండటం వల్ల ఈరోజుకు మరింత విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో మకర సంక్రాంతి పండుగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు ఈ సంక్రాంతి పండుగని పెద్ద పండుగగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక శుద్ధి, నూతన శక్తికి సంబంధించిన పండుగగా పరిగణిస్తారు. ఈ పండుగ వేళ పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు, సూర్యారాధన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణం ప్రారంభిస్తాడు. అలాగే హిందూ సంప్రదాయం ప్రకారం మకర సంక్రాంతి రోజు చేసే దానధర్మాలు, పుణ్య కార్యాలు, పరిహారాలు ఏడాది పొడవునా సుఖశాంతులు, సిరిసంపదలు, శ్రేయస్సు కలిగిస్తాయని నమ్మకం. ఈ సంక్రాంతి పండుగ రోజు సాధారణంగా ఇరుగు పొరుగు వారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇస్తారు. సంక్రాంతి పండుగ, మకర సంక్రాంతి పండుగ అందమైన రంగవల్లులకు.. గొబ్బెమ్మలకు.. హరిదాసుల పాటలకు.. బసవన్నల ఆటలకు.. నువ్వుల మిఠాయిలకు.. గాలిపటాలు ఎగరేయడానికి ఇలా ఎన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ సంక్రాంతి పండుగను పంటల పండుగ అని.. అలాగే మార్పు తీసుకొచ్చే పండుగ అని కూడా అంటారు. అలాగే ఈ పండుగలు అనేవి మన వర్తమాన, భవిష్యత్తులను గుర్తుచేస్తూ.. స్పృహతో మలచుకోవాలి అనే విషయాలను గుర్తుచేస్తాయి. అంతే కాకుండా ఈ సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడిని నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పించడం వల్ల ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయని పండితులు చెబుతారు. వేకువజామున లేచి తలంటుకుని స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి అర్ఘ్యం వదలాల్సి ఉంటుంది. అంటే ఈ పండుగ రోజుల్లో స్నానం చేయకపోతే కనుక 7 జన్మల పాటు రోగాల బారిన పడి నిర్ధనుడై జీవిస్తాడని శాస్త్రంలో చెప్పారు. కాబట్టి పవిత్రమైన సూర్య సంక్రమణం సమయంలో స్నానం చేయడం ఎంతో శుభప్రదం. ఈ పండుగ మూడు రోజులు ఎంత పని ఉన్నా ఎలా ఉన్నా స్నానం మాత్రం తప్పకుండా చేసి శుచిగా ఉండాలి.ముఖ్యంగా ఈ మూడు రోజులు తెల్లవారు జామున నిద్రలేచి సూర్యోదయం వేళ స్నానం చేసి సూర్య నమస్కారం చేస్తే ఎంతో పుణ్యప్రదం. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు,బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది.పంచభూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్యపదమని నమ్మకం.ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్మజీవు లను నశింపజేస్తుంది. హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడించే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది. క్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారు జామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపన్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.

# తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు

- భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు
- భోగి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

విజయవాడ,జనవరి14(పద్మక్రాంతి):





తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. వేకువజామునే భోగిమంటలు వేసి ఆనందంగా పండగను ప్రారంభించారు. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా గడిపారు . సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అని అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. అలాగే భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మల కొలువును కూడా జరుపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా భోగి సంబరాల్లో పాలుపంచుకున్నారు. విజయవాడలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివాన్ గేటెడ్ కమ్యూనిటీలో అత్యంత వైభవోపేతంగా భోగి సంబరాలు నిర్వహించారు. అటు ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో భోగి సంబరాలు అంబరాన్నంటాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో భోగి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామం సొంత ఇంటి వద్ద భోగి పండుగ నేపథ్యంలో టెంకాయ, అరటి ఆకులతో ప్రత్యేక తోరణాలతో అలంకరించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం పెదఅమిరంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నివాసం వద్ద భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజకీయ ప్రముఖులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సభాపతి భోగి మంటలు వెలిగించారు. ఏలూరూ సమీపంలోని దుగ్గిరాలలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఎమ్మెల్యే. ఆపై భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు.



విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో మహా సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భోగి మంటలు వేశారు. ఈ వేడుకల్లో పెద్దఎత్తున స్థానికులు పాల్గొన్నారు. ఈనెల 9 నుంచి 16 వరకు కాలేజీ గ్రౌండ్స్‌లో మహా సంక్రాంతి సంబరాలు జరుగనున్నాయి. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా సెట్టింగ్స్, సాంప్రదాయ బద్ధమైన నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నెల్లూరు జిల్లాలో పెద్దఎత్తున భోగి సంబరాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన భోగి సంబరాల్లో మంత్రి నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రజలతో కలిసి భోగి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి నారాయణ అన్నారు. ప్రజలందరూ అష్టయిశ్వర్యాలతో తులతూగాలని మంత్రి ఆకాంక్షించారు. విజయవాడలో భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. వాడ వాడలా తెల్లవారుజాము నుంచే ప్రజలు భోగి మంటలు వేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. ఎంపీ శాస్త్రోక్తంగా పూజలు చేసి భోగి మంటలు వెలిగించారు. ఈ వేడుకల్లో టీడీపీ నేతలు గద్దె అనురాధ, బొప్పన భవకుమార్ తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ఫొటోతో ముద్రించిన పాస్ పుస్తకాలను భోగి మంటల్లో వేశారు టీడీపీ నేతలు. గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలతో తెలుగు మహిళలు సందడి చేశారు. విజయవాడ గొల్లపూడిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. వేడుకలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆస్తి పత్రాలపై గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఫొటోతో రూపొందించిన జీవో కాపీలను స్థానిక రైతులు, మంత్రి, ఎమ్మెల్యే కలిసి భోగి మంటలలో వేసి తగలబెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని మంత్రి పార్థసారథి తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రపంచమంతా గుర్తిస్తోందన్నారు. వైసీపీ నాయకులకు రాష్ట్రంలో అభివృద్ధి కనిపించకపోవడం సిగ్గుచేటు అంటూ మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు హోంమంత్రి అనిత. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి మంత్రి నివాసం వద్ద కుటుంబ సమేతంగా భోగి వేడుకలో అనిత పాల్గొన్నారు. భోగి పర్వదినం సందర్భంగా హోంమంత్రి నివాసం కోలాహలంగా మారింది. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా భోగి వేడుకలు నిర్వహించారు. భోగి పండుగ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా, రైతు జీవితంతో విడదీయరాని పండుగ అని అనిత అన్నారు. పాత కష్టాలను వదిలి.. కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ భోగి పండుగ రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తూ పాలన సాగిస్తున్నారని హోం మంత్రి పేర్కొన్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఆమె భోగి మంటలు వేసి సందడి చేశారు. అనంతరం గో పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఏర్పాటు చేసిన కేరళ డప్పులను మంత్రి అనిత కొద్దిసేపు వాయించి అందరిలో ఉత్సాహం నింపారు

# రిజిస్ట్రేషన్ రుసుము ..తీగ లాగితే..కదులుతున్న డొంక...!

- తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్ట్రార్ల పత్రపై అనుమానాలు
- కూపీ లాగుతున్న అధికారులు

హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):

ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి ఎన్ని లావాదేవీల్లో ఇలాంటి పొరపాట్లు జరిగి ఉంటాయనే దానిపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.వందల కోట్ల విలువైన భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో మాత్రం రుసుం మొత్తంలో నామమాత్రంగా 1శాతం చెల్లించినా లావాదేవీలు పూర్తయ్యాయి. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉంటే... దస్త్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్ట్రార్లు మిన్నకున్నారు. 2020లో ప్రైవేటు సంస్థ ద్వారా ప్రారంభమైన ధరణి నుంచి ప్రస్తుత భూభారతి వరకు... అనేక సాంకేతిక లోపాలు కనిపించడం గమనార్హం. జనగామలో వెలుగుచూసిన సాగు భూముల రిజిస్ట్రేషన్ ఈ-చలానా చెల్లింపుల్లో మోసం వ్యవహారంలో రోజురోజుకు అనేక కొత్త విషయాలు బహిర్గతం అవుతున్నాయి. ఎసిబి ఎస్పీ సింధుశర్మ నేతృత్వంలోని హైలెవెల్ కమిటీ ఈ వ్యవహారంపై అన్వేషణ ప్రారంభించింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించిన ప్రకారం... భూమి మార్కెట్(బుక్ వాల్యూ) విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీ, మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2,500, పాస్ పుస్తకానికి రూ.350, హరితపన్నుగా రూ.50... ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించాలి. మార్కెట్ విలువ ఆన్‌లైన్‌లో ముందుగానే నిర్ధారించి ఉంటుంది. సర్వే నంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఎంత చెల్లించాలనేది కంప్యూటర్ తెరపైన కనిపిస్తుంది. చెల్లింపుల్లో ఏ ఒక్క రూపాయి తక్కువైనా ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా తిరస్కారానికి గురవుతుంది. కానీ, 4,800 లావాదేవీల్లో 1శాతం రుసుం మాత్రమే చెల్లించినా ఎక్కడా రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవలేదు. ధరణి/భూభారతి పోర్టల్‌లో ఉన్న బలహీన సాంకేతికత అక్రమ లావాదేవీలకు ఆస్కారం కల్పించిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ధరణిని ప్రైవేటు సంస్థ నిర్వహించగా, ఇప్పుడు భూభారతి ఎన్ఐసీ చేతిలో ఉంది. ధరణి నుంచి భూభారతిగా మారిన తర్వాత కొనసాగిన లోపాలు, ప్రస్తుతం వెలుగు చూసిన ఈ-చలాన్ల సొమ్ము దారిమళ్లింపునకు అనుమతిచ్చిన సాఫ్ట్‌వేర్ బలహీనతలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరందు వీటిపై ఎన్ఐసీ నిపుణులతో చర్చిస్తున్నట్లు సమాచారం. సాగు భూముల రిజిస్ట్రేషన్లకు అత్తెసరు ఛార్జీలు చెల్లించినా వాటిని ఆమోదించి డీడ్స్‌పై సంతకాలు చేసిన తహసీల్దార్ల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ సెంటర్‌లో చలానా చెల్లించి నిర్దిష్ట తేదీన తహసీల్దారు-సంయుక్త సబ్ రిజిస్ట్రార్ వద్దకు భూముల క్రయ, విక్రయదారులు, నలుగురు సాక్షులు కూడా వస్తారు. పాసుపుస్తకాలను, ఫొటోలను, సెల్ నంబర్లను పరిశీలించుకోవడం, రికార్డుల్లో ఉన్న వ్యక్తి, హాజరైన యజమాని ఒక్కరేనా అనేది తేల్చుకోవడం తహసీల్దారు బాధ్యత. దీంతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వ నిబంధనల మేరకే చెల్లించారా అనేది కూడా తప్పనిసరిగా పరిశీలించడమనేది మరో ముఖ్యమైన విధి. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ ముఖ్య సహాయకుడిగా పనిచేయాలి. కీలక బాధ్యతల విషయంలో తహసీల్దార్లు, ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర అంశంగా రెవెన్యూ శాఖ భావిస్తోంది.




# 72 ఏళ్లకోమారు మారుతున్న సంక్రాంతి తేదీ

- 14 నుంచి 15కు మారడం వెనక భూ భ్రమణమే కారణం

హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):



తెలుగు రాష్ట్రాలకు పెద్ద పండగ అంటే సంక్రాంతి. దేశవ్యాప్తంగా కూడా మకర సంక్రాంతిని జరుపుకుంటారు. దేశంలోని పలు ప్రాంతాలలో పొంగల్, లోహ్రీ, మాఘ బిహు, కిచ్డి వంటి వివిధ పేర్లతో పండుగ చేసుకుంటారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సందర్భంలో ఈ పండుగను చేసుకుంటారు. మకర సంక్రాంతి సౌర చక్రం ఆధారంగా ఉంటుంది. అందువల్ల, ఇది దాదాపు ప్రతి సంవత్సరం ఒకే తేదీన వస్తుంది. అయితే ఇటీవలి కాలంలో సంక్రాంతి పండుగ తేదీ మారింది. చాలా సంవత్సరాల పాటు జనవరి 14వ తేదీనే సంక్రాంతిని జరుపుకునే వాళ్లం. అయితే 2008 నుంచి మాత్రం జనవరి 15వ తేదీన సంక్రాంతిని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. దీని వెనుక ఓ ఆసక్తికర కారణం ఉందట. భూమి సూర్యుని చుట్టూ తిరిగే కక్ష్యలో వచ్చిన చిన్న మార్పు వల్లే సంక్రాంతి పండుగ జనవరి 14 నుంచి 15కు మారిందట. భూమి తన కక్ష్యలో తిరుగుతూ స్వల్పంగా దిశ మార్చుకోవడం వల్ల, సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయం కొద్దిగా మారుతుంది ప్రతి సంవత్సరం ఈ మార్పు సుమారు 20 నిమిషాలు ఉంటుంది. ఈ 20 నిమిషాల తేడా వల్ల, సుమారు 72 సంవత్సరాలకు ఒకసారి సంక్రాంతి తేదీ ఒక రోజు తర్వాతకు జరుగుతుంది అందుకే 1935 నుంచి 2007 వరకు జనవరి 14న ఉన్న సంక్రాంతి, 2008 నుంచి జనవరి 15కి మారింది. ఇలా 2080 సంవత్సరం వరకు జనవరి 15వ తేదీనే సంక్రాంతి వస్తుందట. 2081వ సంవత్సరం నుంచి మాత్రం సంక్రాంతి జనవరి 16కు మారుతుందట.

## రాష్ట్రప్రజలకు చంద్ర బాబు సంక్రాంతి శుభాకాంక్షలు

- పండగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్ష



అమరావతి,జనవరి14(పద్మక్రాంతి):

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. కాగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి తన స్వగ్రామం నారావారిపల్లిలో ఉన్నారు. కుటుంబసమేతంగా గ్రామానికి చేరుకుని సందడి చేస్తున్నారు. నారా ఫ్యామిలీతోపాటు నందమూరి కుటుంబం సైతం చంద్రబాబు స్వగ్రామం వెళ్లి ఆనందంగా గడుపుతున్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు సీఎం చంద్రబాబు. 'సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర పర్వదినం మకర సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. విశిష్టమైన ఈ సంక్రాంతి పండుగ మీ జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పాడిపంటలతో పల్లె సీమలు మరింత కళకళలాడాలని, ఆధునికతను సంతరించుకున్నప్పటికీ, మన సంప్రదాయాలను మరచిపోకుండా పాటించాలని కోరుకుంటున్నాను. ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా రైతన్నలు ఆనందంగా ఉండాలని, కష్టజీవులు శ్రమకు తగిన ఫలితం పొందాలని, అందుకు అనువైన పథకాలతో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరిస్తుందని హామీ ఇస్తున్నాను. సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ మరొక్కమారు అందరికీ శుభాకాంక్షలు' అని సీఎం చంద్రబాబు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ద్వారా సందేశమిచ్చారు.

గురువారం, జనవరి 15, 2026

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక

# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

- ఏపిలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భారీగా తరలిచ్చిన తెలుగు రాష్ట్రాల వీక్షకులు
- ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర నేతల రాకతో హడావిడి

విజయవాడ,జనవరి14(పద్మక్రాంతి):



తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

## కర్నాకటలోనూ చైనా మంజా పంజా

- బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా
- తీవ్ర రక్త స్రావంతో అక్కడిక్కడే మృతి

బెంగళూరు,జనవరి14(పద్మక్రాంతి):




చైనా మాంజా యమ పాశంగా మారి దేశవ్యాప్తంగా అనేక మందిని బలి తీసుకుంటోంది. తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు. బీదర్ జిల్లా తలమడగి వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితుడిని సంజు కుమార్ హాళసమణిగా గుర్తించారు. హాళసమణి బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మెడకు మాంజా చుట్టుకోవడంతో కోసుకుపోయి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైంది. ఆయన తన కూతురికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నంలో ఉండగానే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కల వారు గాయాలకు కర్చీఫ్‌లను అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశారు. మరికొందరు అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలోనే కన్నుమూశారు. హాళసమణి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఆయన ప్రాణాలతోనే ఉండి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జాప్యమే ఆయన ప్రాణాలను తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో మృతుడి బంధువులు, స్థానికులు ధర్నాకు దిగారు. ఎమ్జర్గ÷న్సీ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాంజాపై నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇక ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గాలిపటాలను ఎగురవేయడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, గాలిపటాల కోసం సాధారణ మాంజాలకు బదులుగా కొందరు చైనా మాంజాలను వినియోగించడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల నుంచి వేళ్లాడే మాంజాలు వాహనదారులకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్స్‌పై ప్రయాణించే వారికి ఇవి యమ పాశాలుగా మారుతున్నాయి.

# శబరిగిరులపై మకరజ్యోతి దర్శనం

- మార్మోగిన స్వామి శరణం నామస్మరణం
- పులకించిపోయిన అయ్యప్ప భక్తులు

తిరువనంతపురం,జనవరి14(పద్మక్రాంతి):



శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్శన కోటాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ.. తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే.. బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక జనవరి 12వ తేదీన పందళం రాజప్రసాదం నుంచి బయలుదేరిన స్వామివారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహాదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది. అంటే సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల వరకు అంటే పావుగంట మధ్య మూడుసార్లు స్వామివారు దీప రూపంలో దర్శనమిచ్చారు. జనవరి 19వ తేదీ వరకు స్వామివారి దర్శనం కొనసాగనుంది. ఆ మరునాడు అంటే జనవరి 20వ తేదీ ఆలయాన్ని

# పడిపోయిన టమోటా ధరలు

## మదనపల్లె మార్కెట్‌లో కిలో 25కే విక్రయం



మదనపల్లె,జనవరి14(పద్మక్రాంతి):

మదనపల్లెలో కిలో టమోటా రూ.25కు పడిపోయాయి. మంగళ వారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌కు 90 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే వచ్చాయి. వాటిలో పది కిలోల మొదటి రకం టమోటాలు రూ.250, రెండో రకం రూ.230, మూడో రకం రూ.200లతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేశారని మార్కెట్ సెక్రటరీ జగదీష్ తెలిపారు. పదిరోజుల క్రితం కిలో టమోట రూ.50 పలుకగా, వారం రోజులుగా రేట్లు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కనీసం పంటలు వేసేందుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదని, ధరలు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయకుండా మానేయడమే మేలని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో ధరలు పతనం కాగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం టమోటా ధరలు అకాశాన్నంటు తుండడంతో వినియోగదారులు బేంబేలెత్తుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కిలో టమోటా రూ.50 పలుకుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఈ ధర మరింత ఎక్కువగా తీసుకుంటున్నారు. ఈ ధరలవల్ల పంట పండించే రైతు తీవ్రంగా నష్టపోతుండగా వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు బాట ధర కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి

## మురుగున్ నివాసంలో పొంగల్ వేడుకలు

### స్వయంగా పొంగలి వండిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి14(పద్మక్రాంతి):



పొంగల్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా తొలుత ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రధాని నిర్వహించారు. అనంతరం ఆయనే స్వయంగా పొంగల్ వండారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోవులకు పూజ చేశారు. పొంగల్ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. మరోవైపు ఈ పొంగల్ వేడుకను పలువురు ప్రముఖులు ఘనంగా జరుపుకుంటున్నారు. అలానే దేశ వ్యాప్తంగా ప్రజలు వివిధ రకాల వంటకాలు చేసుకుని, ఇళ్లను అలకరించుకుని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.

మొదటి పేజీ తరువాయి ..

## ఉత్సాహంగా సాగిన కైట్ ఫెస్టివల్

థాయిలాండ్, ఉక్రెయిన్, వియత్నాం, జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా వంటి 19 దేశాల నుండి 40 మంది నిపుణులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అలాగే భారత దేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ స్థాయి కైట్ ప్లేయర్స్ పాల్గొని వైవిధ్యమైన పతంగులను ఎగురవేస్తున్నారు. భూమి నుండి ఆకాశానికి రంగురంగుల సందేశాలు పంపుతున్నారా అన్నట్టుగా గ్రౌండ్ అంతా పతంగులతో నిండి పోయింది. డాల్ఫిన్లు, కార్టూన్ క్యారెక్టర్లు, డ్రాగన్లు, భారీ ఆకారాల్లో ఉన్న గాలిపటాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది.
ఇక్కడి ప్రజల ఉత్సాహం, ఆతిథ్యం అద్భుతం అని అంతర్జాతీయ ప్లయర్స్ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది మరికొన్ని పతంగులతో పాటు ప్రత్యేక ఆకర్షణలు కూడా తోడయ్యాయి. అక్కడ వివిధ రాష్ట్రాల సంప్రదాయ మిఠాయిల స్టాల్స్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. జనవరి 16 నుంచి 18 వరకు పరేడ్ గ్రౌండ్‌లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, అలాగే గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్ కూడా జరగనున్నాయి. ఇదిలావుంటే కైట్ ఫెస్టివల్‌కు తోడు స్వీట్ ఫెస్టివల్ కూడా అలరించింది. రకరకాల స్వీట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

## భోగి వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

ఎద్దుల బండిపై వారు వారంతా అటుఇటు తిరిగారు. దేవాన్ష్‌తోపాటు శ్రీభరత్ దంపతుల చిన్నారులు సైతం ఈ సందర్భంగా గ్రామంలోని పిల్లలందరికీ చేతులు ఊపుతూ ఎద్దుల బండిలో తిరిగారు. అనంతరం ఈ ఎడ్ల బండి దిగి.. స్థానికంగా ఉన్న చిన్నపిల్లకు వీరు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పిల్లల్లో ఆనందం వెల్లువిరిసింది. తన స్వగ్రామం నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు మంత్రి నారా లోకేశ్ స్వగ్రామానికి చేరుకున్న సంగతి తెలిసిందే. నాలుగు రోజులపాటు వీరు స్వగ్రామంలోనే ఉండి.. సంక్రాంతి సంబరాలు జరుపుకోనున్నారు. మంగళవారం ఉదయం స్వగ్రామంలో ఏర్పాటు చేసిన.. ముగ్గుల పోటీలను సీఎం సతీమణి నారా భువనేశ్వరితోపాటు నారా బ్రాహ్మణి పరిశీలించారు. లాగే చిన్నారులకు ఆటల పోటీలు.. మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, కాక్గ ÷ట్, త్రీలెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భారీగా బాలురు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే గ్రామస్తుల నుంచి అర్జీలను సీఎంతోపాటు ఆయన తనయుడు, మంత్రి నారా లోకేశ్ స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా వారికి తండ్రి తనయులు భరోసా ఇచ్చారు. ఇక మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సైతం సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నాలుగు రోజులపాటు ఈ సంబరాల్లో పాల్గొని సీఎం చంద్రబాబు నాయుడు తిరిగి అమరావతికి చేరుకోనున్నారు.

## ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా- డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.

## మహిళా ఐఏఎస్‌పై అసత్య కథనాలు

వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

## వ్యక్తిత్వ హననం జరిగితే సహించం

వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననంపై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశర చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్క్యులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరోమారు స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్దాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## యాచారం మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**నంది వనపర్తి గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్**

యాచారం, జనవరి 14,(పద్మక్రాంతి):



యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్ యాచారం మండల ప్రజలందరికీ సంక్రాంతిశుభాకాంక్షలు తెలిపారు. భోగీ, సంక్రాంతి, కనుమ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ప్రజల జీవితాల్లో అభివృద్ధితో పాటు మార్పు రావాలని కోరారు. వ్యవసా-యానికి అనుబంధంగా ఉన్న పంటలు చేతికి వచ్చి ఆ పంటలను ఆహార ధాన్యంగా మా-ర్చుకునే గొప్ప పండుగ సంక్రాంతి అన్నారు. చెడు ఆలోచనలన్నీ భోగిమంటలో కలిసిపోవాలని మళ్లీ పంటలు వేసే ప్రయత్నంలో ఉన్న రైతులకు అన్ని శుభాలు జరగాలని అయన ఆకాంక్షించారు.సంక్రాంతి తెచ్చే సంబరాలతో ప్రతి ఇంటిలో ఆనందా సిరులు
వెల్లివిరియాలని ఆయన కోరారు.

## జర్నలిస్టుల అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం...

- **నాగర్ కర్నూల్ జిల్లా జర్నలిస్ట్ సంఘం నాయకులు యూసుఫ్ బాబా...**

పద్మక్రాంతి, జనవరి 14,(కల్వకుర్తి ప్రతినిధి):



హైదరాబాదులోని ఎన్టీవీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీవీ జర్నలిస్టులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారి తీసింది అని సంక్రాంతి పండుగ వేళలో జర్నలిస్టుల ఇళ్లకు వెళ్లి ఎలాంటి ప్రొసీజర్ పాటించకుండా, నోటీసులు ఇవ్వకుండానే పోలీసులు అరెస్ట్ చేయడానికి నాగర్ కర్నూల్ జిల్లా జర్నలిస్ట్ సంఘం నాయకులు మొహమ్మద్ యూసుఫ్ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ ప్రశ్నించే తత్వంతో ముందుకెళ్తున్న జర్నలిస్టులను అర్ధరాత్రి వేళలో ఇండ్లకు వెళ్లి అరెస్ట్ చేయడం, తెలంగాణ రాష్ట్రంలో పత్రిక స్వేచ్ఛ మరియు ప్రజాస్వామ్య విలువలపై జారీ జరిగిన ప్రత్యక్ష మరియు ప్రమాదకరమైన దాడిగా అభివర్ణిస్తున్నట్టు మీడియా కార్యాలయంలో పోలీసులు సోదాలు జర్నలిస్టుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రంగా వ్యతిరేకించారు,అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని యూసుఫ్ బాబా డిమాండ్ చేశారు.

## యాచారం మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

- **చౌదర్ పల్లి గ్రామ సర్పంచ్ కేశమోని రాజు**

యాచారం, జనవరి 14,(పద్మక్రాంతి):



యాచారం మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామ సర్పంచ్ కేశమోని రాజు యాచారం మండల ప్రజలందరికీ సంక్రాంతిశుభాకాంక్షలు తెలిపారు. భోగీ, సంక్రాంతి, కనుమ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ప్రజల జీవితాల్లో అభివృద్ధితో పాటు మార్పు రావాలని కోరారు. వ్యవసా-యానికి అనుబంధంగా ఉన్న పంటలు చేతికి వచ్చి ఆ పంటలను ఆహార ధాన్యంగా మా-ర్చుకునే గొప్ప పండుగ సంక్రాంతి అన్నారు. చెడు ఆలోచనలన్నీ భోగిమంటలో కలిసిపోవాలని మళ్లీ పంటలు వేసే ప్రయత్నంలో ఉన్న రైతులకు అన్ని శుభాలు జరగాలని అయన ఆకాంక్షించారు.సంక్రాంతి తెచ్చే సంబరాలతో ప్రతి ఇంటిలో ఆనందా సిరులు వెల్లివిరియాలని ఆయన కోరారు.

## బోడుప్పల్లో ఘనంగా భోగి సంబరాలు

**పతంగులు ఎగరేసిన మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి**





బోడుప్పల్, జనవరి 14 (పద్మక్రాంతి):

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ ఐ ఐ సి టి కాలనీలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి సందర్భంగా కాలనీవాసులతో కలిసి భోగి మంటలు వేశారు. అనంతరం మిత్రులు శ్రేయోభిలాషులు కాలనీవాసులతో కలిసి పతంగుల ఎగరేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ ఈ సంక్రాంతి ప్రజల జీవితాలలో కాంతులు వెదజల్లాలని, అందరూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో ఆదర్శవంతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. బోడుప్పల్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గౌడ్ , మాధవ రెడ్డి, రవి,శివ శంకర్, గణేష్ పాల్గొన్నారు.

## “పాశం మైలారంలో ప్రజలతో కలిసి సంక్రాంతి సంబరాలు-

**చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేసిన ఎల్. శ్రీకాంత్ రెడ్డి”**



పటాన్ చేరు, జనవరి 14,(పద్మక్రాంతి):

ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశం మైలారం వార్డులో సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఎల్. శ్రీకాంత్ రెడ్డి తన స్వగ్రామంలో ప్రజలతో కలిసి సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ పండుగను ప్రజలతో మమేకమై జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆనందాన్ని మరింత పెంచేలా ఎల్. శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి అంటే గాలిపటాల పండుగ అనే భావనను గుర్తుచేస్తూ, గ్రామంలోని చిన్నపిల్లలందరికీ గాలిపటాలను పంపిణీ చేశారు. రంగురంగుల గాలిపటాలతో పిల్లలు ఉత్సాహంగా పండుగను ఆస్వాదించగా, గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.

ఈ సందర్భంగా ఎల్. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ వ్యవసాయ రంగానికి, రైతులకు ఎంతో ప్రాధాన్యత కలిగిన పండుగ అని పేర్కొన్నారు. రైతుల కష్టానికి ఫలితం దక్కే కాలం ఇదేనని, ఇలాంటి పండుగలు గ్రామీణ జీవనానికి ఉత్సాహాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలతో కలిసి పండుగను జరుపుకోవడం తనకు ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు.

గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ప్రజాప్రతినిధులు పండుగల వేళ ప్రజల మధ్య ఉ ఒడటం సంతోషకరమని వ్యాఖ్యానించారు. పిల్లల ముఖాల్లో చిరునవ్వులు చూడటం పండుగకు మరింత శోభను చేకూర్చిందని అన్నారు. ఈ సంక్రాంతి వేడుకలు గ్రామంలో సామాజిక ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు దోహదపడినట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం

- బుగ్గతండా క్రికెట్ లీగ్ ప్రారంభించిన
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- మొదటి బహుమతి రూ.10వేలు,రెండవ బహుమతి రూ.5వేలు అన్ని షీల్డులు స్పాన్సర్ చేసిన ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్

ఇబ్రహీంపట్నం ప్రతినిధి, జనవరి 14,(పద్మక్రాంతి):




క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీరక ధృడత్వం తొడ్పాడుతాయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఆరుట్ల గ్రామ పరిధిలోని బుగ్గతండాలో క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు ఈ టోర్నమెంట్ లో మొదటి బహుమతి రూ.10 వేలు,రెండవ బహుమతి రూ. 5 వేలు, అన్ని షీల్డులను ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్,దాసరమోని రమేష్, మానిపాటి వెంకటేష్,కంబాలపల్లి బుగ్గరాములు, య-ూత్ కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, ఆర్ల శ్రీకాంత్,పాండాల శ్రీనివాస్, భాస్కర్ రైనా, దాసరమోని అశోక్,రావుల నాగరాజు, బుడిగల పరమేష్, సపావత్ లచ్చిరాం, కొల్లోజు మహేష్ చారి, సపావట్ గణేష్, ఉదయ్, శ్రీకాంత్,వెంకటేష్,బుగ్గతండా గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీ పై బిఆర్ఎస్ శ్వేతపత్రం విడుదల



మంచిర్యాల జిల్లా/రామకృష్ణాపూర్ జనవరి14 (పద్మక్రాంతి):

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలోని బిఆర్ఎస్ నాయకులు బుధవారం శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో పట్టణ అభివృద్ధిని కుంటుపరుస్తోందని ఆరోపించారు.

బిఆర్ఎస్ హయాంలోనే స్వర్ణయుగం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో క్యాతనపల్లి మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాజా రమేష్ అన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ 3,000కు పైగా సింగరేణి ఇళ్లకు పట్టాలు ఇచ్చి వేల కుటుంబాల్లో వెలుగులు నింపిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదే అని అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆడబిడ్డలకు అండగా నిలవడంతో పాటు, కుల వృత్తులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్, అంతర్గత రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరా మరియు బాల్క ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు చేసిన సేవలను ఆయన వివరించారు.

**అసంపూర్తిగా నిలిచిన పనులు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన కీలక ప్రా-జెక్టులను గాలికొదిలేసిందని ఆరోపించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వైకుంఠధామం, స్పోర్ట్స్ అథరిటీ, మహిళా భవనాలు, కమ్యూనిటీ భవనాలు వంటి పనులను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న కొద్దిపాటి పనులు కూడా గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే సాగుతున్నాయని స్పష్టం చేశారు.

**పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కంభగోని సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, అలుగుల సతయ్య, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, జిలకర మహేష్, తిరుపతి, అనిల్ రావు, గడ్డం రాజు, జక్కన బోయిన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా స్వేచ్ఛను హరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **జర్నలిస్టుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం**

**- సిలివేరు శంకర్ ప్రజాపతి, బి.జె.పి. రాష్ట్ర నాయకులు**

బోడుప్పల్, జనవరి 14 (పద్మక్రాంతి):





ప్రభుత్వంపైగానీ, అధికారంలో ఉన్న పార్టీ లేదా పార్టీకి సంబంధించిన విషయంలో గానీ, అవాస్తవమైన అసంబద్ధమైన, అనుచిత వార్తను న్యూస్ ఐటమ్ గా చూపించి ఉంటే ఇంటలిజెన్స్ సహకారంతో నిజనిర్ధారన చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలి కానీ అందుకు బిన్నంగా ఎటువంటి అరెస్ట్ వారెంట్ లేకుండా పండుగ పూట అర్ధరాత్రి సమ-యంలో బలవంతంగా అరెస్ట్ చేయడమంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి వ్యవస్థను కాంగ్రెస్ సర్కార్ భయపెడుతుందని బిజెపి రాష్ట్ర నాయకులు సిలివేరు శంకర్ ప్రజాపతి అన్నారు. అదేవిధంగా ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన మీడియా స్వేచ్చను, బావ ప్రకటనా స్వచ్చను హరించే చర్యలు హేయనీయమన్నారు.వార్తాపత్రికలు, వార్తచానల్లకే కాక యూట్యూబ్ చానల్లకు కూడా హెచ్చరికచేసినట్లు అరెస్ట్ వారెంట్ లేకుండా అక్రమ అరెస్టులు చేయడం, సర్చ్ వారెంట్ లేకుండా మీడియా కార్యాలయంలోనికి వెళ్లడం పోలీసులకు కూడా తగదన్నారు. ప్రజాస్వామ్యంలో అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు మంచి పద్దతి కాదని వెంటనే అరెస్టుచేసన వారిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు.





తలకొండపల్లి జనవరి 14 (పద్మక్రాంతి):

తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చౌదర్ పల్లి గ్రామంలో ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేకంగా తయా-రుచేసిన కేకును కోసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి ఉప్పల వెంకటేష్,కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామపంచాయతీ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన మొదటి విజేతకు పట్టుచీరతో పాటు రూ,3000,లు,ద్వితీయ బహుమతి పొందిన మహిళకు పట్టుచీరతో పాటు రూ, 2000/- లు బహుమతుని అందించారు. అనంతరం ప్రాధాన్యత పొందిన 5 మంది ముగ్గులు వేసిన మహిళలకు పట్టు చీరలను అందించారు. అనంతరం ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహువ-ంతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చంద్రయ్య,మాజీ ఎంపీటీసీ మాదుగుల రామస్వామి,గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి దుద్దు పావని కృష్ణయ్య,వార్డు సభ్యులు శేఖర్,మల్లమ్మ రమేష్,తూర్పు శివలక్ష్మి శ్రీను,స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ దుద్దు మల్లయ్య,బోదాసు జంగయ్య,దుద్దు స్వామి,దుద్దు పర్వతాలు,దుద్దు మల్లేష్, సొంటె రమేష్, జలగం శ్రీశైలం,కాలే శ్యాంసుందర్, జాజాలఅబ్రశ్రీ రాఘవేందర్, అనుగుంటి సత్యనారాయణ, అంగన్వాడి టీచర్ నిర్మల,ఆశా వర్కర్ మాధవి, మాదుగుల అఖిల్,రామకృష్ణ,జక్కు కృష్ణయ్య,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,యువకులు,మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## కొత్తపల్లిలో వాలీబాల్ క్రీడలు ప్రారంభం



**పాపన్నపేట,జనవరి14 (పద్మక్రాంతి)**

:పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రోజు యువకులకు వాలీ బాల్ ఆటలను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించినట్లు బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు,ఆటల పట్ల దృష్టి సారించాలని,ఆటలు శారీరక మానసిక వికాసానికి దోహద పడతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బైండ్ల కుమార్,పుట్ల రమేష్,చెవుల శ్రావణ్, ఏర్పుల ఉదయ్, యూసుపేట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు.





**తలకొండపల్లి, జనవరి 14 (పద్మక్రాంతి):**

తలకొండపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర మాజీ మిషన్ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తాలూకా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించిన మొదటి బహుమతి తలకొండపల్లి గన్స్ టీమ్ కి 50000 రూపాయలు, రెండవ బహుమతి కల్వకుర్తి బుల్లెట్ టీమ్ 30000, రూపాయలు కల్వకుర్తి మూడవ బహుమతి ఆకుతోటపల్లి ఈగల్ టీమ్ 20000 రూపాయలు బహుమతులు అందజేశారు. పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ బహుమతులను అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గం లోని అన్ని మండలాలలోనూ మరియు గ్రామాలలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లు మాజీ జడ్పీటీసీలు టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు అనేక గ్రామాల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డ్ మెంబర్ సభ్యులు నాయకులు యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో 23న మోడీ పర్యటన

- అదేరోజు చెన్నైలో బహిరంగ సభకు ప్లాన్

**చెన్నై,జనవరి14(పద్మక్రాంతి):**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్డీయే తరఫున ప్రచార సభలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 23న రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఖరారైందని బీజేపీ రాష్ట్ర నాయకులు తెలిపారు. అదే సమయంలో ముందుగా అనుకున్నట్లు సభను మదురైకి బదులుగా రాజధాని నగరం చెన్నైలో ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్డీయేలో చేరిన అన్నాడీఎంకే ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందంజలో ఉంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రంలో ఎన్డీయేని బలపరచటంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మదురై నగరంలో ప్రధాని ప్రచార సభ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నిర్ణయించారు. గత వారం బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్ మదురై ప్రచార సభకు అనువైన ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి ప్రధాని మోదీ సభను రాజధాని నగరం చెన్నైలో నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర నాయకులు తీసుకున్న ఈ నిర్ణయానికి బీజేపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దీంతో నయినార్ నాగేంద్రన్ నగరంలో మోదీసభకు అనువైన రెండు ప్రాంతాలను ఎంపిక చేశారు. మహాబలిపురం సమీపం తిరువిడందై వద్ద సైనిక యుద్ధ సామగ్రి ప్రదర్శన జరిపిన ప్రాంతం మోదీ సభకు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ స్థలంతోపాటు పూందమల్లి వద్దనున్న 'వేల్స్ ఫిల్మ్‌సిటీ' ప్రాంతాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాలే కాకుండా చెంగల్పట్టు సమీపంలోను రెండు ప్రాంతాలను ఆయన పరిశీలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## చనిపోయిందనుకున్న బామ్మ లేచింది

- బర్త్‌డే వేడుకగా మారిన అంత్యక్రియల ఘట్టం..

**నాగపూర్,జనవరి14(పద్మక్రాంతి):**

ఒక్కోసారి అనూహ్య ఘటనలె, అద్భుతాలు జరుగుతుంటాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇలాంటి అనూహ్య ఘటన చోటుచేసుకుంది. చనిపోయిందనుకున్న బామ్మ బతికింది. అందరిలోనూ ఆశ్చర్యంతో పాటు, ఆనందం కూడా కలిగింది. అదేరోజు బామ్మ బర్త్‌డే కావడంతో చావుకు వచ్చిన వారంతా కేక్ కట్ చేసి బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే...నగరానికి చెందిన 103 ఏళ్ల వృద్ధురాలు గంగాబాయి సఖారే కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం ఆమె మరణించినట్టు కుటుంబసభ్యులు నిర్ధారించుకున్నారు. చివరి చూపు కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా..వృద్ధురాలి కాలి వేలు కదలడాన్ని ఆమె మనవడు రాకేష్ సఖారే గమనించాడు. వెంటనే అక్కడి వారికి విషయం చెప్పడంతో ఆమె ముక్కులో ఉన్న దూదిని తొలగించగా వృద్ధురాలు శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. దీంతో చనిపోయిందనుకున్న గంగాబాయి బతికే ఉన్నందుకు కుటుంబసభ్యులు సంతోషపడ్డారు. వైద్యులు కూడా ఆమెను పరీక్షించి..ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా అదే రోజు గంగాబాయి 103వ పుట్టిన రోజు కూడా కావడంతో వేడుకలను కుటుంబసభ్యులు ఘనంగా జరిపారు. అంతసేపు బాధలో ఉన్న బంధువులంతా బర్త్‌డే కేక్ తిని ఆనందంగా తమ ఇళ్లకు వెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది.

# పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల నగదు జమ
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

**అమరావతి,జనవరి14(పద్మక్రాంతి):**

సంక్రాంతి పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం బుధవారం చెల్లించింది. దీంతో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల ఖాతాల్లో భారీగా నగదు జమవుతోంది. దాంతో ఆయా ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సంక్రాంతి పండగవేళ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవులతోపాటు కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న బిల్లులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భోగి పండుగ రోజు ఈ నగదు బకాయిలు చెల్లించింది. నగదు ఖాతాల్లో జమ కావడంతో వారంతా ఆనందంలో ఉన్నారు. డీఏ, డీఆర్‌ఏ ఎరియర్స్ నిమిత్తం ఒక్కో ఉద్యోగి, పోలీసుల ఖాతాల్లో రూ.70 నుంచి రూ.80 వేల వరకు నగదు జమ అవుతుంది. పండగ పూట డీఏ, డీఆర్‌ఏ బకాయిలు జమ కావడంతో ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఆనందంలో మునిగిపోయాయి. సుమారు 5.70 లక్షల మంది ఖాతాల్లో ఈ నిధులను ఆర్థిక శాఖ జమ చేస్తోంది. ప్రభుత్వానికి, సీఎంకు ఉద్యోగ సంఘాలు సైతం కృతజ్ఞతలు తెలియజేశాయి. ఈ నిధుల జమపై ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు స్పందించారు. పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులు, డీఏ ఎరియర్లను ప్రభుత్వం విడుదల చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి సంక్రాంతి పండుగను తామందరం చాలా సంతోషంగా జరుపుకుంటామని చెప్పారు. గతంలో సీఎం చంద్రబాబును కలిసి సరెండర్ లీవులకు సంబంధించిన నగదు విడుదల చేయాలని కోరగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పోలీసులు అందరి తరఫున కృతజ్ఞతలతోపాటు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు. అలాగే ఈ నిధులు విడుదలకు సహకరించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోమ్ మంత్రి అనితతోపాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి ఈ సందర్భంగా శ్రీనివాసరావు కృతజ్ఞతలు చెప్పారు.

# ఐ-ప్యాక్ సంస్థపై ఇడి దాడులు

- హైకోర్టులో టిఎంసి పిటిషన్ తిరస్కరణ

**కోల్‌కతా,జనవరి14(పద్మక్రాంతి):**

ఐ-ప్యాక్ సంస్థపై ఇటీవల జరిపిన దాడుల్లో తమ పార్టీ ఫైళ్లు, ఎన్నికలకు సంబంధించిన డేటాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ సీజ్ చేసిందంటూ తృణమూల్ కాంగ్రెస్ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు బుధవారం నాడు డిస్పోజ్ చేసింది. సుప్రీంకోర్టులో ఇదే తరహా పిటిషన్ వేసినట్టు ఈడీ చెప్పడంతో ఆ సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈడీ వేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం గురువారం నాడు విచారణ జరుపనుంది. టీఎంసీకి సంబంధించిన ఎలాంటి డేటాను తాము సీజ్ చేయలేదని కోల్‌కతా హైకోర్టులో విచారణ సందర్భంగా ఈడీ తెలిపింది. కస్టడీలోకి తీసుకోని సామగ్రిని సురక్షితంగా ఉంచాలనడం ఏమిటని ప్రశ్నించింది. ఇది డేటా భద్రతకు సంబంధించిన అంశమే అయితే ఇందుకు సంబంధించిన విజ్ఞప్తిని తాము కట్టుబడి ఉంటామని, ఈడీ ఎలాంటి డేటాను స్వాధీనం చేసుకోలేదని, ఇందుకు భిన్నంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే ఆ డేటా తీసుకువెళ్లారని తెలిపింది. తమ తనిఖీలతో తృణమూల్ కాంగ్రెస్‌కు అసలు సంబంధమే లేదని వివరించింది. కాగా, ఎన్నికలకు సంబంధించిన తమ పార్టీ డేటాను ఈడీ సీజ్ చేసినందున ఆ డేటాకు భద్రత కల్పించాలని కోర్టును టీఎంసీ కోరింది.తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్త, ఐ-ప్యాక్



చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంపై ఈడీ ఇటీవల దాడులు జరిపింది. దీంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించిన పేపర్లు, పార్టీ ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన సమాచారం కలిగిన కంప్యూటర్ హార్డ్ డ్రైవ్‌లు, కీలకమైన డిజిటల్ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఈడీ ప్రయత్నించినట్టు ఆమె ఆరోపించారు. మమతా బెనర్జీ చర్యను బీజేపీ తీవ్రంగా ఖండించింది. లీగల్ ఇన్వెస్టిగేషన్‌ను రాజకీయ అంశంగా చేసుకుని రాజ్యాంగ సంస్థలు, చట్టబద్ధ పాలనను బలహీన పరిచేందుకు సీఎం ప్రయత్నించినట్టు ఆరోపించింది. దర్యాప్తు సంస్థల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఎలాంటి చర్యలనైనా తాము తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. ఇలాంటి చర్యల వల్ల సంస్థల విశ్వసనీయతకు భంగం కలుగుతుందని పేర్కొంది.

# బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదు

**తమిళగ వెట్రి కళగం పార్టీ స్పష్టీకరణ**

**చెన్నై,జనవరి14(పద్మక్రాంతి):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదని సినీ నటుడు విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం తెలిపింది. పొత్తుల విషయంలో తమ పార్టీ గతంలో తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉందని టీవీకే డిప్యూటీ సెక్రటరీ నిర్మల్ కుమార్ తెలిపారు. పొంగల్ రేసులో విడుదలకు సిద్ధమైన విజయ్ 'జన నాయగన్' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకుండా కేంద్రం అడ్డుపడుతోందనే విమర్శలు రావడం, కరూర్ తొక్కిసలాట ఘటనపై మరోసారి విచారణకు ఈనెల 19న హాజరుకావాలని విజయ్‌కు సీబీఐ సమన్లు పంపిన నేపథ్యంలో టీవీకే తాజా ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈనెల 12న విజయ్‌ను సీబీఐ ఆరు గంటల సేపు విచారణ చేసింది . మరుసటి రోజు కూడా విచారణకు రావాలని కోరినప్పటికీ పొంగల్ కారణంగా ఆయన గడువు కోరారు. విచారణ అనంతరం విజయ్ తిరిగి చెన్నైకు చేరుకున్నప్పుడు నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, టీవీకే సైద్ధాంతిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని చెప్పారు. తమకు బీజేపీ సైద్ధాంతిక శత్రువని, ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఆ పార్టీతో పొత్తు ఉండదని వెల్లడించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న అన్నాడీఎంకేతోనూ కలిసేది లేదని తెలిపారు.

న నాయగన్ విడుదల కాకుండా కేంద్రం అడ్డుకోవడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే విమర్శించారు. తమిళ సంస్కృతిపై కేంద్రం దాడి జరుపుతోందన్నారు. తమిళ ప్రజల వాణిని అణిచివేయాలి మోదీ చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావన్నారు. దీనిపై కూడా నిర్మల్ కుమార్ స్పందించారు. 'జన నాయగన్'కు ఎవరు సపోర్ట్ ఇచ్చినప్పటికీ తాము స్వాగతిస్తామని చెప్పారు. కాంగ్రెస్‌తో పొత్తు విషయంపై తమ పార్టీ అధినేత విజయ్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారని వివరించారు. కాగా, 'జన నాయగన్' విడుదలను అడ్డుకోవడం, విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు పంపడం వంటి చర్యల ద్వారా టీవీకేపై బీజేపీ ఒత్తిడి రాజకీయాలకు పాల్పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# మహిళపై ఉద్దేశ్యపూర్వక దుష్ప్రచారం

- వ్యక్తిగత దాడులు...చరిత్ర హననం....అసభ్య వ్యాఖ్యలు
- మహిళల అవమానాన్ని సహించేది లేదు
- ఎక్స్ వేదికగా సజ్జన్నార్ ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**

తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాలు ప్రసారం ఘటన తీవ్ర దుమారాన్ని రేపుతోంది. మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచిన కేసును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు సంస్థ సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ నడువనుంది. ఇదిలా ఉండగా.. మహిళా అధికారిపై అసత్య కథనాలు ప్రసారం చేయడంపై సీపీ సజ్జనార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరమని అన్నారు. ఇకపై మహిళలను అవమానిస్తే సహించేది లేదని సీపీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహిళలపై విమర్శ కాదు.. దుష్ప్రచారం నేరం. ప్రజా జీవితంలో విమర్శలు సహజమే. కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు, చరిత్ర హననం, అసభ్య వ్యాఖ్యలు విమర్శలు కావు.. అవి క్రూరత్వం. ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, గృహిణి అయినా మహిళ గౌరవం అపరిమితం. టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, వార్త కథనాల పేరుతో మహిళలపై దూషణలు అసహ్యకరం. నేడు ప్రతి పనిలో మహిళలు ముందువరుసలో నాయకత్వం వహిస్తున్నారు. పాలన, పోలీసు శాఖ, శాస్త్ర రంగం, మీడియా సహా ప్రజాజీవితంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇల్లు-ఉద్యోగం రెండింటినీ సమతుల్యం చేస్తున్నారు మహిళలు. కనిపించని బాధ్యతలతో కుటుంబాన్ని నడుపుతూ.. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు ప్రగతిపై దాడులే.

భారతీయ సంప్రదాయం చెబుతున్న సందేశం ప్రకారం 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' .. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షం ఉంటుంది. స్పష్టమైన సందేశం ఒక్కటే.. మహిళలపై అవమానం, వివక్ష, చరిత్ర హననం ఇక సహించబోము. ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్.. ఆ భవిష్యత్తు గౌరవంతోనే నిర్మితమవుతుంది.. అవమానంతో కాదు' అంటూ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు.

## ఆర్.వి ఫౌండేషన్ కైట్ ఫెస్టివల్

- పీర్జాదిగూడ మినీ ట్యాంక్ బండ్ వద్ద ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు
- పీర్జాదిగూడ,మేడిపల్లి, పర్వతాపూర్ ప్రజలు, యువకులు, చిన్నారులు పాల్గొనాలని తుంగతుర్తి రవి విజ్ఞప్తి



**పీర్జాదిగూడ, జనవరి 14 (పద్మక్రాంతి):**

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో నేడు (జనవరి 15 గురువారం) ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు పీర్జాదిగూడ మినీ ట్యాంక్ బండ్ (పెద్ద చెరువు) వద్ద "కైట్ ఫెస్టివలు నిర్వహిస్తున్నారు. పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొనబోతున్న ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతాపూర్ ప్రాంతాల యువకులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుంగతుర్తి రవి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు...






**పద్మక్రాంతి, జనవరి 14,(కల్వకుర్తి ప్రతినిధి) :**

కల్వకుర్తి నియోజక వర్గంలోనీ కడ్తాల్,మాడ్గుల్, అమన్ గల్, వెల్దండ మరియు కల్వకుర్తి మండలంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పుట్టినరోజు సందర్బంగా వివిధ మండలాల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కేక్ కటింగ్ చేసి మండల నాయకులతో కలిసి ఘనంగా పుట్టినరోజు జరుపుకోవడం జరిగింది. అదేవిదంగా నియోజక వర్గంలోనీ అన్ని గ్రామాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు మొదటి బహుమతి రూ. 3 వేల రూపాయలు పట్టుచీరరెండవ బహుమతి పట్టుచీర రూ, 2 వేల రూపాయలు 5 పట్టుచీరలు మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి బహుమతులు అందజేసిన ఉప్పల వెంకటేష్ ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున ఉన్నారు.

## చైనా మంజా .. హానికరం





**పాపన్నపేట, జనవరి 14 (పద్మక్రాంతి)**

సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మంజా విక్రయిస్తే కఠిన చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు కిష్టయ్య,శారద వెల్లడించారు. పాపన్నపేట,యూసుఫ్ పేట,కొత్తపల్లి గ్రామాలలో పలు దుకాణాలలో తనిఖీ లు నిర్వహించి,దుకాణ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. చైనా మంజా వాడకంతో వాహన దారులకు,పక్షులకు హాని జరుగుతుందని,పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## రంగవల్లుల సంక్రాంతి సంబరం..




**పద్మక్రాంతి, జనవరి 14, ( కల్వకుర్తి ప్రతినిధి ):**

వెల్దండ మండలం రాచూరు గ్రామంలో గోకమల్ల కర్ణాకర్ ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ కార్యక్రమం గ్రామ పంచాయతీ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 38 మంది పాల్గొన్నారు. విజేతలకు గోకమల్ల కర్ణాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గున్నెల్ల శ్రీనివాస్,నాయకులు కొవ్వూరు వెంకటరావు, కొంగళ్ళ యాదయ్య, వెంకటయ్య, గ్రామ వార్డు సభ్యులు పడకంటి వెంకటేష్ గుత్తి చంద్రశేఖర్ దుబ్బ రామార్జున్, గోకమల్ల ప్రేమ్ కుమార్, పడకంటి బాలకృష్ణ, రవికుమార్, కొంగళ్ల జగదీష్,గోద శ్రీనివాస్ గౌడ్, గోకమల్ల రంజిత్,రాస్కెశివకుమార్,అనిల్ మల్లేష్,తదితరులు ఉన్నారు.

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# కామారెడ్డి జిల్లాలో దారుణ ఘటన

- 600 కుక్కలను హతమార్చి పాతిపెట్టిన సర్పంచ్‌లు
- జంతు ప్రేమికుల ఫిర్యాదుతో వెలికితీసి పోస్ట్‌మార్టమ్

**కామారెడ్డి,జనవరి14(పద్మక్రాంతి):**

మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్‌పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి గ్రామ పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్టే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# జిల్లాలను మారిస్తే తీవ్ర పరిణామాలు

- మాజీ స్పీకర్ మధుసూధనాచారి హెచ్చరిక

**హనుమకొండ,జనవరి14(పద్మక్రాంతి):**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రతీకార పాలన కొనసాగిస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్ రెడ్డి జేజమ్మ తరం కూడా కాదన్నారు. కేసీఆర్ పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజనను చేశారని, జిల్లాలను మార్చే దుర్మార్గానికి ఒడిగడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. చేతనైతే ఇచ్చిన హామీ ప్రకారం సాగు సాయాన్ని పెంచి అందించాలని, ఏదో ఒక సాకుతో జిల్లాలలో మార్పులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో మార్పులు జరుగుతే తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాడే పార్టీ బీఆర్ ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. గతానికి అదనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతగల ప్రభుత్వం దానికి భిన్నంగా జిల్లాలు కుదిస్తాం, మార్చేస్తాం అనే బాధ్యతారాహిత ప్రకటనలతో గందరగోళం సృష్టించి వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమన్నారు. సమావేశంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్లు సోదా కిరణ్, నాయకులు ఇమ్మడి రాజు, శోభన్, సల్వాజీ రవీందర్ రావు, పానుగంటి శ్రీధర్, ఎండీ గౌస్‌ఖాన్, ఏలిషా, సౌరం రఘు, సంపతి రఘు, ఎస్కే మహిమూద్, తక్కళ్లపల్లి వినీల్ రావు, ఇమ్మడి స్నేహిత్, జేకే పాల్గొన్నారు.

# తలసానిపై పోలీస్ కేసు నమోదు

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**



మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి నేత తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి తలసాని చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రవికిరణ్ దేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఆర్ నగర్ పోలీసులు తెలిపారు.

# ఎన్టీవీ జర్నలిస్లు అరెస్టు తొందరపాటు చర్య

- కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**



ఎన్టీవీలో వచ్చిన ఓ కథనంపై రేవంత్ సర్కార్ ఓవర్ రియాక్షన్ చేస్తోంది. జర్నలిస్టులపై రేవంత్ సర్కార్ ప్రతాపంపై పౌరసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తాజాగా ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టులను కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఖండించారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం మంచిది కాదని హితవు పలికారు. నోటీసులు ఇచ్చి వ్యక్తిగతంగా వివరణ తీసుకుంటే బాగుండేదన్నారు. జర్నలిస్టుల అరెస్టులతో రాష్ట్రంలో యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. తెలంగాణ పోలీసుల చర్యలను ఖండిస్తున్నా.. తలుపులు బద్దలుగొట్టి దౌర్జన్యంగా బద్దలుగొట్టి ఇంట్లోకి వచ్చారు. పండగకు భార్యతో వెళ్తుండగా ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్‌ను లాక్కెళ్లడం సరికాదు. ప్రొసీజర్, నోటీసులు లేకుండానే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

# ఓరుగల్లు కోటలో ఘనంగా భోగి మంటలు

- ఉత్సాహంగా పాల్గొన్న నగర ప్రజలు

**వరంగల్,జనవరి14(పద్మక్రాంతి):**

చరిత్ర కోట గోడల మధ్య సంక్రాంతి సంబురం మొదలైంది. మంచు కురుస్తున్న వేళ, ఓరుగల్లు లోగిళ్లు భోగి మంటల సెగలతో వేడెక్కాయి. మనసులోని మాలిన్యాలను వదిలించుకోవాలనే సందేశంతో నగరవాసులు భోగి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజామునే మహిళలు తమ ఇంటి ముందు కళ్లాపి చల్లి, అతి పెద్ద ముగ్గులను తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఖిలా వరంగల్, శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట, ఆదర్శనగర్, దూపకుంట, బొల్లికుంట, గాడిపల్లి గ్రామాలతో పాటు నగరంలోని పాతబస్తీలలో గొబ్బెమ్మల సందడి ప్రత్యేకంగా కనిపించింది. పసుపు కుంకుమలతో అలంకరించిన గొబ్బెమ్మల మీద నవధాన్యాలు చల్లి ప్రకృతిని పూజించడం విశేషం. నగరంలోని అపార్ట్‌మెంట్ కల్చర్‌లోనూ సంప్రదాయం వెల్లివిరిసింది. అపార్ట్‌మెంట్ వాసులంతా సామూహికంగా భోగి మంటలు వేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాత కాలపు ఆచారాలను నేటి తరానికి పరిచయం చేస్తూ, హరిదాసుల కీర్తనల మధ్య గడిపిన క్షణాలు అలరించాయి. . అలాగే పిండి వంటల వాసనలతో ఓరుగల్లు వీధులు ఘుమఘుమలాడుతున్నాయి.

# మహబూబ్‌నగర్, నల్గొండలు వెనకబడిన జిల్లాలు

**ఇప్పుడే అభివృద్ధి దిశగా సాగుతున్నాయి**

**జిల్లా పర్యటనలో పలు కార్యక్రమాలకు మంత్రుల శ్రీకారం**




**మహబూబ్‌నగర్,జనవరి14(పద్మక్రాంతి):**

మహబూబ్‌నగర్, నల్గొండలు వెనకబడిన జిల్లాలని.. ఇప్పుడు ఈ రెండు జిల్లాలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి పర్యటించారు. ఈ సందర్భంగా భూత్పూర్‌లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం.. కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంత బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. నేడు రూ. 60 కోట్లతో మూడు మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. అలాగే కురుమూర్తి స్వామి దేవాలయానికి ఘాట్ రోడ్డు కోసం రూ. 140 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పనులు పూర్తయినట్లు బీఆర్ఎస్ చెబుతోందని.. కానీ రూ. 27000 కోట్లు మాత్రమే ఎలా ఖర్చు అయిందని ఆయన ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణపై కేసీఆర్‌కు ప్రేమ లేదని.. అందుకే ఇక్కడ కేవలం మూడు సీట్లు మాత్రమే వచ్చాయని మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కలేదని విమర్శించారు.

20 రోజుల్లో మునిసిపల్ ఎన్నికలు, త్వరలో జిల్లా పరిషత్ ఎన్నికలు రాబోతున్నాయని కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎప్పుడో ఒకసారి బయటకు వచ్చేవారని.. కానీ రేవంత్ రెడ్డి ఎల్లవేళలా ప్రజల్లోనే ఉంటారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లాలో దారుణం

- ఉరితాళ్లుగా చైనా మాంజా
- బైకర్ మెడకు తగిలి కోసుకున్న మెడ
- తీవ్రగాయంతో మృతి చెందిన వ్యక్తి

**సంగారెడ్డి,జనవరి14(పద్మక్రాంతి):**



సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ. 1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టులపైనే సిట్ ఎందుకు

- కాంగ్రెస్ నేతల అవకతవకలపై సిట్ వేయండి
- అన్నింటిపైనా దమ్ముంటే విచారణ జరపండి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**



జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిళ్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు.

కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమిషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ. 300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమిషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమిషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.

# మహిళా ఐఎఎస్‌పై అసభ్య కథనాలు

- టీవీ ఛానల్ జర్నలిస్టుల అరెస్ట్

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**

తెలంగాణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరఫున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికారుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# రాజకీయ క్రీడలో భాగంగానే అరెస్టులు

- కాంగ్రెస్ సర్కారార్ తీరుపై ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**




ఎన్‌టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్ట్ ను ఖండిస్తున్నామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ క్రీడలో భాగంగా నచ్చిన వారిని మంత్రులను చేయడానికి టీవీ చానెళ్లకు లీకులు ఇచ్చి ఉపయోగించుకొని మరల వారి మీదనే సిట్ వేసి అరెస్టులకు పాల్పడుతుందని ఆరోపించారు. అర్ధరాత్రి అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జరుగుతున్న పరిణామాలన్నీ డ్రామాలని యావత్ ప్రజలకు తెలుసనీ, ఎమర్జెన్సీని తలపించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా వెంటనే విడుదలచేయాలి డిమాండ్ చేశారు.కాగా, ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.

# 18న ఖమ్మం జిల్లాలో సిఎం పర్యటన

- సిపిఐ మహాసభలకు రేవంత్ హాజరు

**ఖమ్మం,జనవరి14(పద్మక్రాంతి):**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ మహాసభల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అదేరోజు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ. 25 కోట్లతో నూతనంగా నిర్మించిన మద్దులపల్లి మార్కెట్ యార్డ్, రూ. 25 కోట్లతో నిర్మించిన నర్సింగ్ కళాశాల ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ. 108 కోట్లతో నిర్మించబోయే జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. అందులో భాగంగా మద్దులపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని సీపీ సునీల్‌దత్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి.రాంప్రసాద్, మార్కెట్ చైర్మన్ హరినాదబాబులు పరిశీలించారు.

# రైలు నుంచి కిందపడి ఆర్మీ జవాన్ మృతి

**వరంగల్,జనవరి14(పద్మక్రాంతి):**

రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తు జారిపడి భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకి చెందిన సంతోష్ కుమార్ (48) పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఇండియన్ ఆర్మీ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే అండమాన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 16032)లో ప్రయాణిస్తున్నారు. అదే రోజు రాత్రి 10:40 గంటల సమయంలో రైలు కేసముద్రం- ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యకు రాగానే సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు రైలు నుండి కిందకు జారిపడ్డారు. ఈ ప్రమాదంలోఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుని వద్ద లభించిన ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసి, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు.

# గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,జనవరి14(పద్మక్రాంతి):**

హైదరాబాద్‌లో మరోసారి భారీ అగ్ని ప్రమాదం కలకలం రేపింది. మంగళవారం రాత్రి కూకట్‌పల్లి రాజీవ్ గాంధీ నగర్‌లోని ఓ గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్యాస్ రీఫిల్లింగ్ జరుగుతున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైరిరజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. మంటలు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగిసిపడటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్ సమీపంలోని ప్రజలను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగింది అనే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పద్మక్రాంతి
RNI No : TELTEL/2022/85167
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం..

(హైదరాబాద్)

భూతంలా ప్లాస్టిక్ పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. నిషేధాజ్ఞలున్నా విచ్చలవిడిగా వినియోగం పెరుగుతోంది. ఉత్పత్తి లేకుండా చేయడంలో అధికార యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. గ్రేటర్‌లో రోజూ 8వేల టన్నుల చెత్త పోగవుతుండగా అందులో 14శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ రహితనగరంగా మార్చాలంటే 'సిక్కిం' తరహా కఠిన విధానాలు అవలంబించాలని నిపుణులు సూచిస్తున్నారు.

అక్కడ ఇలా..: పర్యావరణ పరిరక్షణలో దేశంలోనే ముందున్న రాష్ట్రం సిక్కిం. ప్లాస్టిక్ వ్యర్థాలు భారీవర్షాల సమయంలో డ్రైన్లను అడ్డుకోవడంతో అక్కడ కొండచరియలు విరిగిపడి అనేకమంది మరణించారు. ఈ నేపథ్యంలోనే 1998లో తొలిసారిగా డిస్పోజబుల్ ప్లాస్టిక్‌క్యారీ బ్యాగ్‌లు (50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్నవి) నిషేధించింది. 2016లో థర్మకోల్ ప్లేట్లు, డిస్పోజబుల్ ఉత్పత్తులపై పూర్తి నిషేధం అమలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ నీటిని నిషేధించడంతో పాటు 2022 జనవరి నుంచి 2 లీటర్లు అంతకంటే తక్కువ సామర్థ్యంఉన్న ప్లాస్టిక్ నీటిసీసాల తయారీ, దిగుమతి, అమ్మకం, వినియోగంపై ఆంక్షలు విధించింది. 2022 డిసెంబరు 31నుంచి 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లపై నిషేధం విధించింది. ప్రకటనలే పరిమితం చేయకుండా మున్సిపల్ స్క్వాడ్‌లు, కాలుష్య నియంత్రణ మండలి బృందాలు నిరంతరం తనిఖీలుచేస్తున్నాయి. ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తున్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలతో చిన్నారులకు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

**నగరంలో పరిస్థితి ఇదీ...**

నగరంలోని ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలు - 300(సుమారు).. ప్రధాన రకాలు-సింగిల్ యూజ్ ప్లాస్టిక్



మూసీ నది చుట్టూ 10 టన్నులకుపైగా ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ అవుతున్నాయి. ఫ్లోటింగ్ ట్రాష్ బారియర్లున్నా చాలా నదిలోకి చేరుతున్నాయి. ఇవి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ వర్షాకాలం వరదలకు కారణమవుతున్నాయి.

హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. నగరంలోని వేర్వేరు చెరువుల్లో లేక్ క్లీనప్ డ్రైవ్‌లు చేపడుతుండగా 70శాతం వ్యర్థాలు ప్లాస్టిక్‌వే ఉంటున్నాయి.

మైక్రోప్లాస్టిక్ భూమి, నీటిని కలుషితం చేస్తున్నాయి. జంతువులు ప్లాస్టిక్‌ను తిని మరణిస్తున్నాయి.

**ప్రత్యామ్నాయాలు ఇవీ..**

హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఫిల్టర్ వాటర్ స్టేషన్లు, రీయూజబుల్ బాటిళ్లు (బాంబూ, స్టీల్, సీసంవాటికి బాటిళ్లకు ప్రోత్సాహం)

జనపనార, కాగితం, వస్త్రంతో చేసిన సంచుల వినియోగం పెంచాలి.

కంపోస్టబుల్ బ్యాగ్‌లు వాడాలి.

హోటళ్లలో విస్తారాకులు, అరిటాకులు ఉపయోగించాలి.

బాంబూప్లేట్లు, కప్పులు, ఎడిబుల్ వస్తువుల వినియోగం పెంచాలి.

# ఫ్యూచర్ సిటీ తెలంగాణ పేరుతో కొత్త వెబ్‌సైట్..

(హైదరాబాద్)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీకి సరి కొత్త వెబ్‌సైట్‌ను అధికారులు రూపొందిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వీలైనంత వేగంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథరిటీ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఐటీశాఖలోని ఓ విభాగానికి ఈ పనిని అప్పగించారు.

ప్రాజెక్టుల సమగ్ర వివరాలు : జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వెబ్‌సైట్ల తరహాలోనే ఈ ఫ్యూచర్ సిటీ పోర్టల్ ఉండనుంది. ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమస్త సమాచారం ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు దీని ద్వారా తెలుసుకునేందుకు సులభమైన పద్ధతిలో వీలుంటుంది. ప్రస్తుతానికి ఫ్యూచర్ సిటీ తెలంగాణ పేరుతో ఒక వెబ్‌సైట్ మాత్రం అందుబాటులో ఉంచారు. ఇందులో రకరకాల ప్రాజెక్టుల సమగ్ర వివరాలున్నాయి.

32 గ్రామాల పరిధిలో భారీ విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీ : రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచ గ్రామాల పరిధిలో ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది. ఇటీవల ఇదే ప్రాంతంలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047 విజయవంతం కావడంతో నిరంతర అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకోనున్నాయి. ఐటీ, ఫార్మా సంస్థలతో పాటు గేమింగ్ జోన్లు, వినోద కేంద్రాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు.

ఆన్‌లైన్ ద్వారానే అన్నీ రకాల అనుమతులు : తొలిదశలో 32 గ్రామాల పరిధిలో 432 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఫ్యూచర్ సిటీ నిర్మించాలని ప్రతిపాదించగా, భవిష్యత్ విస్తరణకు అనువుగా 56 గ్రామాలు, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో నిర్మాణం కానుంది. ఇందులో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాలు, పరిశ్రమలు, ప్రైవేటు విద్యా సంస్థలు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేందుకు ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్లను స్వీకరించనున్నారు.

20 మంది సర్వేయర్లు : ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు భూములు, పట్టాలు, ప్రభుత్వ భూముల సరిహద్దులను నిర్ణయించేందుకు ప్రత్యేకంగా ఇరవై మంది సర్వేయర్లను ప్రభుత్వం నియమించింది. మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ శాశ్వత భవన కార్యాలయాన్ని ఫిబ్రవరి నెలాఖరులోపు ప్రారంభించేందుకు అధికార వర్గాలు సన్నాహాలు చేస్తున్నారు. ఫ్యూచర్‌సిటీకి సంబంధించి కీలక అంశాలను ప్రశ్నలు, సమాధానాల రూపంలో ఫ్యూచర్‌సిటీ తెలంగాణ పోర్టల్‌లో అందులో ఉంచారు. ఇందులో ఇళ్ల నిర్మాణాలు, ప్లాట్ల క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి. ప్రాజెక్టుపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు వెబ్‌సైట్‌లో ప్రశ్నలు-సమాధానాలు డిపార్ట్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం : భారత్ ఫ్యూచర్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం (డీసీఎస్) అమలులోకి తేనున్నారు. ఏసీ లేకుండానే చల్లబర్చే డీసీఎస్‌ను కొత్తగా నిర్మించే నగరాలు, టౌన్‌షిప్పులు, మాల్స్‌లో ఇప్పుడు ఎక్కువగా వాడుతున్నారు. తెలంగాణలో మొదటగా ఫ్యూచర్ సిటీలో అమలుకు సర్కారు వివిధ ప్రణాళికలు సైతం సిద్ధం చేసింది. ఇటీవల తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్‌లో దీని గురించి ప్రకటన సైతం చేశారు.

ఈ ఫ్యూచర్ సిటీలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ) అత్యంత కీలకం కానుంది. సీబీడీని క్రమంగా పలు జోన్లుగా అభివృద్ధి చేస్తారు. ఇందులో 300 ఎకరాల్లో ఏఐ సిటీ, 200 ఎకరాల్లో హెల్త్ సిటీ, 500 ఎకరాలను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తారు. 3 వేల ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్‌ను డెవలప్ చేయనున్నారు. ఇక్కడ డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్నే అమలు చేయనున్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్నే వాడుతున్నారు. అలానే రాష్ట్రంలోని పోచారంలో ఇన్ఫోసిస్, ఐటీ కారిడార్‌లోని ఒక గేటెట్ కమ్యూనిటీలో ఈ తరహాలోనే కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు అధునాతమైన డీసీఎస్‌ను సిటీకి ప్రభుత్వం పరిచయం చేయనుంది.

# ఒంటరితనంతో బాధపడుతున్నారా.. అయితే ఇలా చేయండి

(హైదరాబాద్)

కొంత మంది ఒంటరిగా మిగిలిపోయామని బాధపడుతుంటారు. తమకంటూ ఎవరూ లేరని, చుట్టూ ఉన్నవారు కూడా దూరం చేస్తున్నారని భావిస్తారు. నిజానికి మన అలవాట్లు, ఆలోచనా తీరు, మనస్తత్వమే మనుషుల్ని మనకు దూరం చేస్తాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఒంటరినని భావించే వారిలో ఈ లక్షణాలు ఉంటాయంటున్నారు.

ఎవరితోనూ చెప్పరు : చాలా మంది తమ భావోద్వేగాలను లోలోపలే దాచేసుకుంటారు. ఎవరితోనూ పంచుకోవాలని అనుకోరు. కనీసం తమను ఎంతగానో ప్రేమించే కుటుంబసభ్యులు, స్నేహితులతోనూ ఏమీ చెప్పుకోరు. ఇలా చేస్తే ఎదుటివారు 'నాపై ఇష్టం/నమ్మకం లేదేమో, అందుకే ఏమీ చెప్పట్లేదు' అనుకుంటారు. అలాగే క్రమంగా దూరమవుతారు.


ఎవరూ నన్ను అర్థం చేసుకోవడం లేదు : 'నన్ను, నా ఫీలింగ్స్?ను అసలు పట్టించుకోరు, నేను లేకపోయినా ఎవరికీ నష్టం లేదు' అని అనుకుంటారు. ప్రతి సారి మనం చెప్పకుండా ఎవరూ అర్థం చేసుకోలేకపోవచ్చు. మనం కోరుకున్నట్లు స్పందించలేకపోవచ్చు. దీంతో నిరాశ, నిస్పృహలే ఎదురవుతాయి. బంధాల మధ్య అపార్థాలు మొదలవుతాయి. ఎవరూ నన్ను అర్థం చేసుకోలేదని, ఒంటరినైపోయానని ఫీలవుతారు.

గొడవయితే మౌనం : బంధాల్లో కొన్నిసార్లు అసౌకర్యం తప్పదు. మొహమాటాలు, గొడవలు, భావోద్వేగాల్లో వైరుధ్యం సహజమే. అయితే, ఒంటరిగా మిగిలిపోయేవారు వీటిని ఎదుర్కోవడానికి భయపడతారు. మాట్లాడి పరిష్కరించుకునే అవకాశం ఉన్నా మౌనంగా ఉండిపోతారు. దీంతో బంధాలు బీటలువారడం, క్రమంగా దూరం పెరగడం జరుగుతాయి.

ఎదుటి వారూ ముఖ్యమే : ఎవరైనా ఒక విషయం చెప్పినప్పుడు నాకూ అలాగే జరిగింది అంటూ గతంలోకి వెళ్లి తన గురించే చెప్పుకుంటారు. ఇలా చేయడం వల్ల ఎదుటివాళ్లు తాము చెప్పింది వినిపించుకోలేదని భావిస్తారు. తమ మాటలకు గౌరవం ఇవ్వట్లేదని అనుకుంటారు. దీంతో మాట్లాడటం మానేస్తారు.

అతిగా ఆలోచనలు : ఎవరైనా ఏదైనా మాట అన్నా, మెసేజ్ ద్వారా స్పందించినా, వాటి గురించే అతిగా ఆలోచించడం, ఆ మాట వెనుక ఉద్దేశ్యం ఏంటని విశ్లేషించడం, ప్రతికూల ఫలితాలనే ఊహించుకోవడం చేస్తుంటారు. దీని వల్ల అనుమానాలు పెరిగి, బంధాలు దెబ్బతింటాయి. ఏమీ జరగకపోయినా ఏదో జరిగిపోయిందన్నట్లుగా భావించి ఎదుటివారిని దూరం చేసుకుంటారు.

కారణం ఏదైనా అబద్ధం వద్దు : కొంతమంది ఎదుటివారు బాధపడకూడదని, గొడవలు జరగకూడదని నిజాలు దాచేసి మౌనంగా ఉండిపోతారు. మంచి కోసమే చేస్తున్నామని అనుకుంటారు. అయితే, చెప్పనంత మాత్రాన అవి కనుమరుగవవు. పైగా మనిషిలో అసహనాన్ని పెంచుతాయి. ప్రశాంతతనివ్వవు. మాట్లాడితే వచ్చే గొడవల కన్నా ఈ మౌనం బంధాల మధ్య మరింత దూరాన్ని సృష్టిస్తుంది.



నా తలరాత ఇంతే : కొన్ని నమ్మకాలు మనిషి ప్రవర్తనను మార్చేస్తాయి. 'నేను ఎప్పుడూ ఒంటరిగా మిగిలిపోతాను'అనే నమ్మకం కూడా ఆ కోవలోకే వస్తుంది. కొందరు నా తలరాత ఇంతే అనుకుంటూ ఎవరితోనూ కలవరు. ఎదుటివాళ్లు దూరం పెడతారమోనని, ముందుగానే వీరే దూరంగా ఉండిపోతారు.

ఏం చేయాలి : పైన పేర్కొన్నవన్నీ ఎదుటి వ్యక్తుల వల్ల వచ్చిన ఒంటరితనం కాదు తప్పుడు భావనలు, అలవాట్లతో చేజేతులా తెచ్చుకునే పరిస్థితి. దీనిపై అవగాహన పెంచుకొని, జీవనశైలి, అలవాట్లలో మార్పులు చేసుకుంటే పరిస్థితులు మారే అవకాశాలున్నాయి.

మొదట తమ గురించి ఎదుటివాళ్లు ఏం అనుకుంటారనే ఆలోచనను పక్కన పెట్టాలి. లోపలి భావాలను నమ్మకమైన వ్యక్తులకు తెలియజేయాలి. స్నేహితుల్ని, కుటుంబసభ్యుల్ని పలకరించి మాట్లాడాలి. వారితో మాట్లాడితే ఒంటరిననే ఆలోచన రాదు.

సరిపడా నిద్ర, పౌష్టికాహారం, వ్యాయామం రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలి. ఇవీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృఢంగా ఉంచుతాయి. స్నేహితులతో కలిసి జిమ్‌కు, వాకింగ్‌కు వెళ్తే బంధం మరింత పెరుగుతుంది.

ఖాళీగా ఉంటే ఒంటరిననే భావనే వస్తుంది. ఆ అవకాశం రానివ్వొద్దు. అలాంటి సమయంలో నచ్చిన పుస్తకం చదవడం, సంగీతం వినడం, గార్డెనింగ్ ఇలా ఏదో ఒక పనిలో నిమగ్నమైతే సరి.

నలుగురి మధ్య ఉండటం, నలుగురితో మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. క్లబ్, క్లాస్, వాలంటీర్‌గా పనిచేయడం, ఆన్‌లైన్ కమ్యూనిటీ యాక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొనాలి. అభిప్రాయాలను ఏ బెరుకు లేకుండా చెప్పాలి.

కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి భోజనం చేయడం, షికారుకు వెళ్లడం వంటివి చేస్తుండాలి. అప్పుడు, వీళ్లంతా నా కోసం ఉన్నారనే భావన కలుగుతుంది. ఒంటరిననే ఆలోచన దూరమవుతుంది.

అవసరమైతే మానసిక వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి. మానసిక చికిత్స తీసుకోవడం అనేది బలహీనత కాదు. మంచి భవిష్యత్తు కోసం తీసుకునే ధైర్యవంతమైన నిర్ణయంగా భావించాలి.

# 'మిల్క్ ఏటీఎం'- ఇకపై 24 గంటలూ అందుబాటులో పాలు..

(హైదరాబాద్)

సాధారణంగా ఏటీఎం అంటే డబ్బులు విత్‌డ్రా లేదా డిపాజిట్ చేసే మిషన్ అని మనకు తెలుసు. కానీ ఓ చోట అచ్చం ఏటీఎంలా ఉండే ఓ మిషన్‌లో డబ్బులకు బదులు పాలు వస్తున్నాయి. మిషన్ నుంచి పాలు రావడం ఏంటని ఆశ్చర్యపోతున్నారా? అవును మీరు విన్నది నిజమే. మధ్యప్రదేశ్?లో అచ్చం ఏటీఎం మిషన్ లాగానే కార్డు లేదా స్కాన్ చేసి వారికి కావాల్సినన్ని పాలను పొందే వెసులుబాటును తీసుకొచ్చారు. ప్రజలకు 24 గంటలు పాలు అందుబాటులో ఉండాలని ఓ వ్యక్తి తీసుకున్న నిర్ణయం ఇది. ఇందుకోసం 'మిల్క్? ఏటీఎం' మిషన్?ను ఏర్పాటు చేశారు. అంతేకాదు, ఈ మిషన్ రాకతో అతని పాల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు మిషన్ వల్ల ఉన్న ఉపయోగాలు ఏమిటి? ఈ కథనంలో తెలుసుకుందాం !

మిల్క్ ఏటీఎంతో పాల సమస్యలకు చెక్

ఛింద్వాఢా జిల్లాకు చెందిన ఆకాశ్ సూర్యవంశీ అనే వ్యక్తి మిల్క్ ఏటీఎం మిషన్‌ను ఏర్పాటు చేశారు. సాధారణంగా మధ్యాహ్నం లేదా రాత్రి సమయాల్లో ప్రజలు పాలకోసం ఇబ్బందులు పడడం సర్వసాధారణమని, కానీ ఈ స్టార్టప్?తో ఇకపై ప్రజలకు 24 గంటలూ పాలు అందుబాటులో ఉంచవచ్చునని ఆయన పేర్కొన్నారు. అయితే, తాను ప్రధాన నగరాల్లో ఉన్న మిల్క్ ఏటీఎంలను చూశానని, దాన్ని ఛింద్వాఢాలో ప్రారంభిస్తే ప్రజలకు పాల సమస్యల నుంచి విముక్తి కలిగించవచ్చునని భావించారు. ఈ క్రమంలో మిల్క్ ఏటీఎంను ప్రారంభించారు. దీంతో ప్రజలు ఇకపై రాత్రుల్లో కూడా పాల కోసం ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

ఇది ఎలా పనిచేస్తుందో తెలుసా?

"ఈ ఏటీఎం చూడటానికి నగదు లావాదేవీలు చేసే మిషన్ లాగానే కనిపిస్తుంది. కానీ వాస్తవానికి అదొక 'మిల్క్? ఏటీఎం మిషన్ల. దీని ప్రత్యేకతలు ఏంటంటే? ఇందులో దాదాపు 200 లీటర్ల పాలను నిల్వచేయగల సామర్థ్యం ఉంది. అంతేకాదు ఈ మిషన్‌లోని పాలు 5 రోజుల పాటు పాడవకుండా ఉంటాయి. ప్రజలు వీటిని కార్డ్? లేదా క్యూఆర్? ద్వారా పొందవచ్చు." అని ఆకాశ్ వంశీ తెలిపారు.




ఆవులు, గేదెలు పెంచేవారికి ప్రయోజనం!

మరోవైపు, ఈ స్టార్టప్‌ను ప్రారంభించిన ఆకాశ్ వంశీ తన గ్రామంలో పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నానని తెలిపారు. అయితే ఈ మిషన్‌ను ఏర్పాటు చేయడం వల్ల పాల ఉత్పత్తిదారులు, రైతులు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ యంత్రం రాకతో ఇకపై వారు 24 గంటలు పాల సరఫరా చేయగలరని ఆకాశ్? పేర్కొన్నారు. ఈ మిల్క్? ఏటీఎం 24 గంటలు పనిచేయడం వల్ల పాల వినియోగం కూడా పెరుగుతుందని, అలాగే వినియోగదారులకు ఇబ్బందులు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఆవులు, గేదెలు పెంచేవారు కూడా ప్రయోజనం పొందుతారని తెలిపారు. అయితే, ఒకప్పుడు నిర్దిష్ట సమయాల్లో మాత్రమే పాలను సేకరించేవారని, కానీ ఈ యంత్రం రాకతో ఎప్పుడైన పాలకేంద్రానికి వచ్చి పాలను అందిచవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గుతుంది!

ఈ సందర్భంగా ఛింద్వాఢాలోని వార్డ్ నంబర్ 42 కౌన్సిలర్ సందీప్ సింగ్ చౌహాన్ మాట్లాడారు. ఈ మిల్క్ ఏటీఎం మిషన్, పరిశుభ్రతను ప్రోత్సహించడానికి ప్రధాన చొరవ అని అభివర్ణించారు. ఇది ప్రజలకు స్వచ్ఛమైన, శుభ్రమైన పాలను అందిస్తుందని తెలిపారు. ప్రజలు పాలు కొనడానికి తమ ఇంటినుంచి పాల డబ్బాలు, బాటిళ్లను కూడా తీసుకువస్తారని, అయితే దీనివల్ల ప్లాస్టిక్ వాడకం చాలా వరకు తగ్గితుందని అభిప్రాయపడ్డారు. అంతేకాదు, నగరం కూడా పరిశుభ్రంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# విదురుడు చెప్పిన నియమాలు..

మహాభారతంలో ధృతరాష్ట్రుడి సవతి కొడుకే విదురుడు. ఈయన గొప్ప జ్ఞాని. దూర దృష్టి కలిగిన వ్యక్తి. దాని కారణంగానే కొన్ని సమస్యలను ముందుగానే ఊహించేవాడు. కురుక్షేత్ర యుద్ధం కూడా చాలా ఘోరంగా ఉంటుందని ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు. విదురుడు కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల విజయంలో ముఖ్యపాత్ర పోషించిన శ్రీకృష్ణుడితో పాటు విదురుడి సలహాలు కూడా ఉన్నాయి. పాండవులు విదురుడి మాటలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. భీష్ముడు కూడా విదురుడి సలహాలను తీసుకునేవాడు. అయితే విదురుడు ప్రజలకు సహాయం చేయడం గురించి కొన్ని ప్రత్యేక విషయాలను కూడా చెప్పాడు. అవేంటో ఇప్పుడు శిశువుతెలుసుకుందాం. విదురుడు చెప్పిన దాని ప్రకారం మీ సంతానంకు కానీ మీరు ఇష్టపడే వ్యక్తుల క్షేమ కోరుకుంటున్నారో వారికి మంచి తో పాటు చెడు గురించి కూడా హెచ్చరించాలని విదురుడు తెలిపారు. ఇలాంటి విషయాలు చెప్పడంలో ఆలస్యం చేయకూడదని, వారు అడిగే వరకు వేచి ఉండకూడదు అని, చెడు గురించి హెచ్చరించాలి అని విదురుడు తెలిపారు. చెడు గురించి హెచ్చరించిన వారు వినిపించుకోకపోతే అది వారి నిర్ణయానికే వదిలేయాలి అని విదురుడు అంటాడు. ఇలా చేయడం ద్వారా మీరు అన్ని విషయాలతో పాటు తప్పు విషయాలపై కూడా వారికి అవగాహన కలిగించినట్లయితే వారు మీపై సంతృప్తిగా ఉంటారు. ఇప్పుడు ఆ వ్యక్తి తన మంచి చెడ్డలను చూసి తన నిర్ణయం తీసుకోవచ్చు. ఇలా చేయడం వలన రెండు లాభాలు ఉంటాయి. ముందుగా అన్నీ తెలిసిన హెచ్చరించలేదన్న అపరాధ భావం కలగదు. అంతేకాకుండా ఆ వ్యక్తి కూడా భవిష్యత్తులో మీరు తన శ్రేయోభిలాషి అని నమ్ముతారు. విదురుడు విధానాలే కాకుండా అతని జీవితం అంతా కూడా అదే సందేశాన్ని ఇస్తున్నట్లు అనిపిస్తుంది. విదురుడు స్వయంగా తన విధానాలను ధృతరాష్ట్రుడికి చెప్పాడు. యువకుడైన దుర్యోధనుడు ధర్మానికి వ్యతిరేకంగా ఉన్నాడని అతనికి ఫలితం అలానే ఉంటుందని సూచించాడు. అయినా దుర్యోధనుడు విదురుడి విధానాలను అస్సలు అంగీకరించలేదు. కానీ దాని ఫలితం కౌరవుల నాశనానికి కారణం అయింది. అవమానం నిర్లక్ష్యం ఉన్నప్పటికీ విదురుడు తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. కాబట్టి దగ్గరి వారికి అడగకుండానే సలహాలు ఇవ్వమని విదుర నీతి తెలుపుతుంది.

# డిప్రెషన్‌లోకి వెళ్తున్న యువత.. ఒక్క ఫోన్ కాల్‌తో అంతా సెట్?!

(హైదరాబాద్)

దేశవ్యాప్తంగా భావోద్వేగ మద్దతుకు డిమాండ్ పెరుగుతోంది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సమస్యలను 2025 సంవత్సరంలో ఈ ధోరణి స్పష్టంగా చూపించింది. ఏడాది పొడవునా ఆర్థిక ఇబ్బందులు, సంబంధాల సమస్యలు, చదువుపై ఒత్తిడి, ఉద్యోగ భారం, గుర్తింపు సంక్షోభం, సామాజిక ముద్ర వంటి అంశాలతో బాధపడుతున్నవారి నుంచి హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ప్రముఖ మానసిక ఆరోగ్య అవగాహన, ఆత్మహత్య నివారణ హెల్ప్‌లైన్ 1లైఫ్ (www.1life.org.in -% 7893078930)కు నిరంతరంగా, భారీగా కాల్స్ వచ్చాయి. మానసిక ఆరోగ్య సేవలపై అవగాహన పెరగడంతో పాటు భావోద్వేగ సమస్యల తీవ్రత, సంక్లిష్టత కూడా పెరిగినట్టు స్పష్టం చేసింది.

ఈ సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ మధ్య వరకు 1లైఫ్‌కు మొత్తం 38,437 ఫోన్ కాల్స్ వచ్చాయి. ఈ సంఖ్య అవసరం ఎంత పెద్దదో తెలియజేయడమే కాకుండా, సాధారణ బాధలు సంక్షోభం స్థాయికి చేరకముందే వాటిని అడ్డుకునే విషయంలో అనుభూతితో వినడం, టైం స్పందించడం ఎంత కీలకమో స్పష్టం చేసింది.

ఇటీవలి పలు సంఘటనలు ఈ గణాంకాల వెనుక ఉన్న వాస్తవాలను బయటపెట్టాయి. బెంగళూరుకు చెందిన 27 సంవత్సరాల యువకుడు ఆన్‌లైన్ పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో భారీగా నష్టపోయిన తరువాత 1లైఫ్‌ను సంప్రదించాడు. అతడు ఇంటిని, భార్య ఆభరణాలను తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఆ పరిస్థితి అతడిని తీవ్ర నిరాశకు, ఆత్మహత్య ఆలోచనలకు నెట్టింది. 1లైఫ్ సానుభూతితో వినడం ద్వారా అతడికి తన బాధను చెప్పుకొనే అవకాశం కల్పించింది. సహాయం అందుబాటులో ఉందన్న భావనను అతడిలో మళ్లీ తీసుకొచ్చింది.

వివక్షను ఎదుర్కొంటున్నవారి నుంచి కూడా 1లైఫ్‌కు ఫోన్? కాల్స్ వస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన 23 సంవత్సరాల ట్రాన్స్‌జెండర్ సమాజ ధోరణి తనను ఒంటరిగా, నిరుత్సాహంగా మార్చిందని చెప్పారు. ఎంబీఏ పూర్తి చేసి ఐటీ రంగంలో పనిచేస్తున్నా, తరచూ అవహేళన, దూరం పెట్టడం ఎదురయ్యాయి. అవి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. సంభాషణలో తీర్పు ఏమీ ఇవ్వకుండా ఆమె అనుభవాలను గుర్తించి అంగీకరించారు. ఈ సంవత్సర గణాంకాలు, అనుభవాలు దేశవ్యాప్తంగా వేలమందికి 1లైఫ్ కీలక జీవనాధారంగా నిలుస్తున్నట్టు స్పష్టం చేశాయి. అదే టైంలో పెరుగుతున్న డిమాండ్‌ను ఎదుర్కొనే సామర్థ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అవి సూచించాయి. ఆర్థిక, సామాజిక, వృత్తి రంగాల్లో మానసిక ఆరోగ్య సవాళ్లు మరింత తీవ్రం అవుతున్న నేపథ్యంలో వాలంటీర్ల నియామకం, శిక్షణ, నిర్వహణ మద్దతుపై నిరంతర పెట్టుబడి అత్యవసరమని ఈ అనుభవాలు తెలియజేశాయి.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# హాస్యం చుట్టూ తిరిగిన కథ అనగనగా ఒకరాజు




## సంక్రాంతికి నవ్వులు పండించిన నవీన్ పోలిశెట్టి

నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజుఅంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమిందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమిందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలుచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయా-యా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక పల్లెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్ధంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్ధం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.



## పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.




## అసలైన పండగలా మా సినిమా



'సంక్రాంతి' పండుగలోని ఎనర్జీ అంతా 'అనగనగా ఒక రాజు' సినిమాలో ఉంటుంది. ఒత్తిడిని దూరం చేసి, హాయిగా నవ్వించే సినిమా ఇది. ఫ్యామిలీ అంతా హాయిగా కలిసి చూసే పర్‌ఫెక్ట్ పండుగ సినిమా అనమాట. బుకింగ్స్ చాలా బావున్నాయి. మిమ్మల్ని తప్పకుండా అలరించే సినిమా అవుతుంది.' అని హీరో నవీన్ పొలిశెట్టి చెప్పారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు'. మీనాక్షి చౌదరి కథానాయిక. మారి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ నెల 14న సంక్రాంతి కానుకగా సినిమా విడుదల అయ్యింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌లో నవీన్ పొలిశెట్టి మాట్లాడారు. తామంతా ఇష్టంతో కష్టపడి చేసిన సినిమా ఇదని, సినిమా చూస్తున్నంతసేపూ నవ్వుతూనే ఉంటారనీ, మీ స్పందన కోసం ఎదురుచూస్తున్నామని కథానాయిక మీనాక్షి చౌదరి అన్నారు. బాధలన్నింటినీ మరపించి, రెండున్నర గంటలపాటు హాయిగా నవ్వించే పర్‌ఫెక్ట్ సంక్రాంతి చిత్రమిదని డైరెక్టర్ మారి నమ్మకంగా చెప్పారు. 'ఇదో గోదావరి నేపథ్యంతో కూడిన అందమైన కథ. నవీన్ శైలిలో సరదాగా ఉంటుంది. సినిమా ఎంత నవ్విస్తుందో, చివర్లో అంత ఎమోషన్‌కి గురిచేస్తుంది. ఈ గ్రామీణ చిత్రంలో చిన్న పొలిటికల్ సెటైర్ కూడా ఉంటుంది. అన్ని అంశాలతో కూడిన అసలైన పండుగ సినిమా ఇది.' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ పేర్కొన్నారు. ఇంకా బాలనటుడు రేవంత్ కూడా మాట్లాడారు.

## మన శంకరవరప్రసాద్ కలెక్షన్ల దూకుడు

- రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక
- కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న దర్శకుడు

ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజూ కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తంచేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' విజయం సాధించడంతో చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించింది. 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు అనిల్‌రావిపూడి తెలిపారు. ఛాలెంజ్‌గా తీసుకుని సినిమాను పూర్తి చేసినట్లు చెప్పారు. ఇక తన అంచనా ప్రకారం ఈ చిత్రానికి రూ.400 నుంచి 500 కోట్లు వస్తాయని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో చిత్రబృందం తాజాగా సెలబ్రేషన్స్ చేసుకుంది. దర్శకనిర్మాతలతో పాటు చిరంజీవి, వెంకటేశ్, రామ్ చరణ్ ఆ సెలబ్రేషన్స్‌లో పాల్గొని కేక్ కట్ సందడి చేశారు.






## నేనెందుకు క్షమాపణలు చెప్పాలి: మైలకా అరోరా

ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హు-యీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.

## తుంబాడ్ దర్శకుడి మరో మూవీ మయసభ

తుంబాడ్' వంటి కల్ట్ క్లాసిక్‌ను అందించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే నుంచి మరో సంచలనం రాబోతోంది. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'మయసభ'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. 'తుంబాడ్' తరహాలోనే ఈ సినిమాలో కూడా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తున్న జావేద్ జాఫ్రీ గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒక కొత్త అవతారంలో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. వీణా జమ్కర్, దీపక్ దామ్లే, మొహమ్మద్ సమద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.




Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.